మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Circulated to Telangana
Published from Jagitial

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 17-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 49 Issue: 49


17 ఆగస్టు 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:03 సూర్యాస్తమయం - సా. 6:37 తిథి పంచమి సా. 5:05 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం చిత్తా తె. 4:54ం వరకు తరువాత స్వాతి యోగం శుభ తె. 3:22ం వరకు కరణం భాలవ సా. 5:05 వరకు కౌలవ తె. 5:20ం వరకు వర్జ్యం మ. 12:13 నుండి మ. 1:54 వరకు దుర్ముహూర్తం మ. 12:45 నుండి మ. 1:35 వరకు మ. 3:16 నుండి సా. 4:06 వరకు రాహుకాలం ఉ. 7:37 నుండి ఉ. 9:11 వరకు యమగండం ఉ. 10:45 నుండి మ. 12:20 వరకు గుళికాకాలం మ. 1:54 నుండి మ. 3:28 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:27 నుండి తె. 5:15 వరకు అమృత ఘడియలు రా. 10:15 నుండి రా. 11:56 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:45 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున





ప్రపంచాన్ని భారీ వాతావరణ సంక్షోభం తరుముకొస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో వేడెక్కుతున్న సముద్ర జలాలు, మారుతున్న గాలుల దిశలు, ఇప్పటికే తీవ్రస్థాయికి చేరిన కరువులు, వేడి గాలులు, అడవుల మంటల నేపథ్యంలో 2026-27 ఎల్‌నినో మరింత బలపడుతోంది. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ తాజా అంచనాల ప్రకారం.. 2026 చివరి నాటికి ఇది చాలా బలమైన ఎల్‌నినోగా మారే అవకాశం

**90 శాతానికి పైగా ఉంది.**

అంతేకాదు, అక్టోబర్-డిసెంబర్ కాలంలో ఇది ఆధునిక పరిశీలనా చరిత్రలోని అత్యంత బలమైన ఎల్‌నినోలను సైతం అధిగమించే అవకాశం 69 శాతంగా అంచనా వేస్తున్నారు. ఇది కేవలం సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, రుతుపవనాలు, కరువు, వరదలు, ఉష్ణోగ్రతలు, వ్యవసాయం, ఆహార ధరలు, మత్స్య సంపద, జలవనరులు, విద్యుత్ ఉత్పత్తి, రవాణా, వాణిజ్యం వంటి అనేక రంగాలను ఒకేసారి ప్రభావితం చేయగల వాతావరణ వ్యవస్థ.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచం ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు, భూక్షీణత, యుద్ధాలు, ఇంధన-ఎరువుల సరఫరా అంతరాయాలు, ఆహార అసురక్షిత పరిస్థితులతో సతమతమవుతుండటంతో ఈ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# అదిగో ఆకలి రాజ్యం

## చరిత్రలోనే అత్యంత బలమైన ఎల్‌నినో?

### ప్రపంచాన్ని తరుముకొస్తున్న విపత్తు.. 27.4 కోట్లమందిపై ఆకలి పంజా?

ఈవార్తలు స్పెషల్ స్టోరీ



ఎల్‌నినో అనేది భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య, తూర్పు పసిఫిక్ సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే అసాధారణంగా వేడెక్కే సహజ వాతావరణ దృగ్విషయం. ఈ వేడి సముద్ర జలాలు వాతావరణ ప్రసరణను మార్చడంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు, కరువులు, వేడి, తుఫాన్ల తీరు మారుతుంది. ప్రస్తుతం భూమధ్యరేఖ పసిఫిక్‌లోని కొన్ని ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉన్నాయి. అంతేకాదు, సముద్ర ఉపరితలం కింద కూడా భారీగా వేడి నీరు పేరుకుపోతోంది. ఈ లోతైన వేడి నీరు రాబోయే నెలల్లో ఎల్‌నినో మరింత బలపడేందుకు అదనపు శక్తిని అందించే అవకాశముంది. పసిఫిక్ మధ్య, తూర్పు ప్రాంతాల్లో వర్షాలు పెరుగుతుండగా.. ఇండోనేషియా వంటి ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. గాలుల నమూనాల్లోనూ ఎల్‌నినో ప్రభావం స్పష్టమవుతోంది. ప్రపంచ వాతావరణ సంస్థ

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,486 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,362 |

## విశ్వవాణి



ముడి చమురుకు ప్రత్యామ్నాయంగా వాతావరణం లేదా పారిశ్రామిక ఉద్గారాల నుంచి సేకరించిన కార్బన్ డైఆక్సైడ్‌ను ఉపయోగించి విమాన ఇంధనం తయారు చేసే కొత్త కేంద్రం అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించింది. పునరుత్పాదక విద్యుత్‌ను ఉపయోగిస్తూ కార్బన్‌ను తిరిగి ఇంధనంగా మార్చే ఈ విధానం విమానయాన రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాల్లో కీలక అడుగుగా భావిస్తున్నారు.



# నన్నేం పీకలేరు!

### వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం చేయలేరు

### కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్.. నాది సోషల్ జస్టిస్

### పరకాల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజల కోసం ఎంతవరకైనా కష్టపడతానని మీ ఆశీర్వాదం ఉన్నంత వరకు వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో పెడితే ఒరిగేది లేదు కరిగేదని, రేపు శాసనసభలోనే తేల్చుకుందామంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తనకు సోదరి అని, రక్త సంబంధం లేకున్నా తాను సొంత సోదరిగా చూస్తానని అన్నారు. కానీ కేటీఆర్ అలా కాదు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పరకాల-హనుమకొండ, ఆగస్టు 16 (ఈవార్తలు): కేటీఆర్ ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత సోదరిని ఇంటి నుంచి బయటకు పంపించారని, సొంత చెల్లికే న్యాయం చేయని వాడు రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తాడా? అని ప్రశ్నించారు. ములుగు జిల్లాలో పర్యటించిన సీఎం.. చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు తరువాయి 2 వ పేజీలో...

# టిమ్స్.. పేదోళ్ల గుండె చప్పుడు!

### కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యం.. 1,082 పడకలు.. 300 ఐసీయూలు

### 31 మేజర్ ఆపరేషన్ థియేటర్లు.. నిమిషాల్లోనే పరీక్షల నమూనాలు.. నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్




సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సనత్‌నగర్‌లో నిర్మించిన ప్రతిష్ఠాత్మక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ప్రారంభానికి సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆ ఆస్పత్రిని ప్రారంభించనున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 16 (ఈవార్తలు): అత్యాధునిక సాంకేతికత, భారీ మౌలిక వసతులు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో టిమ్స్ సనత్‌నగర్ ప్రభుత్వ వైద్యరంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పనుంది. 22.6 ఎకరాల విస్తీర్ణంలో 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో ఈ సమగ్ర వైద్య సముదాయాన్ని నిర్మించారు. ఒకే దశలో, -2 వ పేజీలో...

# కల్యాణలక్ష్మి రద్దుకు రేవంత్ కుట్ర

### నేడు ధర్నాలకు కేటీఆర్ పిలుపు



కల్యాణలక్ష్మి- షాదీ ముబారక్ పథకంపై సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వతీరును ఎండగడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నిరసనలు చేయాలని సూచించారు.

హైదరాబాద్, ఆగస్టు 16 (ఈవార్తలు): హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కల్యాణ లక్ష్మి అంశంలో హైకోర్టు లో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి, మంత్రుల అవినీతి అంశాల్లో కోట్ల తరువాయి 2 వ పేజీలో...

# రైల్వేస్టేషన్లలో నీళ్లు డేంజర్

### తాగునీళ్లలో ఇ కొలి అనే బ్యాక్టీరియా

## 'కాగ్' సంచలన నివేదిక

### దెబ్బకు రైల్వే మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష

### 20 వేల చోట్ల కొత్త ఫిల్టర్లు ఏర్పాటుకు ఆదేశం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందిస్తున్న తాగునీరు సురక్షితం కాదని, ప్రమాదకర బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించడంతో రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేతృత్వంలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం, స్టేషన్లలో తరువాయి 2 వ పేజీలో...



# బట్టలిప్పి కూర్చోబెడతాడట!

### కంటెంట్ తొలగింపుపై ప్రభుత్వ ఆదేశాలు బహిర్గతం

### పారదర్శకత పెంచేందుకే: ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్

ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కంటెంట్ తొలగింపు లేదా పరిమితులపై ప్రభుత్వాల నుంచి వచ్చే అభ్యర్థనలను యూజర్లకు మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తామని ప్రకటించారు.

న్యూయార్క్: ఆన్‌లైన్‌లో ప్రభుత్వ జోక్యం, కంటెంట్ నియంత్రణ వంటి అంశాల్లో పారదర్శకతను పెంచే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. ఈ కొత్త మార్పుల గురించి ఎక్స్‌లో పోస్ట్ చేసిన మస్క్, "ప్రభుత్వాలు కోరిన ఏ సెన్సార్‌షిప్ అయినా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది" అని తెలిపారు. దీని ప్రకారం, ఏ ప్రభుత్వ ఏజెన్సీ -2 వ పేజీలో...

# నన్నేం పీకలేరు!

**మొదటి పేజీ తరువాయి**



పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుమార్తె పట్ల కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించి బుద్ధి చెప్పాల్సిన తండ్రి ఫామ్ హౌస్లో పడుకున్నాడని... సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే తండ్రి మౌనంగా ఉన్నాడంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగం భాగం ఉన్నట్లేనని అలాంటి తండ్రి కుమారుడు ఈ రోజు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులుగా తయారయ్యారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. మరోవైపు మాజీమంత్రి హరీశ్ రావుపైనా నిప్పులు చెరిగారు. హరీశ్ రావు కాదని ఆయన అఘోర రావు అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హరీశ్ రావు అఘోరా పూజలు చేస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడాలని పూజలు చేస్తున్నట్లు ఆరోపించారు. అయినా దేవుడు మనవైపు ఉండి వర్షాలు కురిపించాడన్నారు. ఇక అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రక్తదానం పేరుతో హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల రక్తాన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని సంచలన ఆరోపణలు చేశారు. ఎప్పటికీ అధికారంలోనే ఉంటామని విర్రవీగిన వారిని వరంగల్ జిల్లా ప్రజలు బండకేసి కొట్టారని...తమను ఓడించేవారే లేరనుకున్న వారిని రాజకీయంగా బొందపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాకలు తీరిన రాజకీయ నేతలను యశస్విని రెడ్డి భారీ మెజారిటీతో ఓడించి ప్రజల తీర్పు ఏంటో చూపించారని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావ-బావమరిది (కేటీఆర్, హరీశ్‌రావు) పదే పదే అడుగుతున్నారని... సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్ను కూడా సభకు తీసుకురావాలని రేవంత్ సవాల్ విసిరారు.

## రైల్వేస్టేషన్లలో నీళ్లు డేంజర్

**మొదటి పేజీ తరువాయి**

సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైల్వే బోర్డును ఆదేశించారు. ఈ సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లోని 20,000 ప్రదేశాలలో వాటర్ కూలర్లతో పాటు సమగ్ర ఫిల్టరేషన్, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్లలో "ట్యాంక్ టూ ట్యాప్" వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పాత నీటి ట్యాంకులను వెంటనే మార్చాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, దీనిపై జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. దేశంలోని అన్ని జోన్ల పరిధిలో 512 నాన్-సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సేవలను కాగ్ అంచనా వేసింది. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు జోన్ల పరిధిలోని ఎనిమిది స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలలో 'ఇ కొలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. 'ఇ కొలి' బ్యాక్టీరియాను గుర్తించిన స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, దక్షిణ రైల్వేలోని కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు, మధ్య రైల్వేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, భీవండి రోడ్, కళ్యాణ్, లోనావాలా, తూర్పు రైల్వేలోని మధుపూర్ ఉన్నాయి. సర్వే చేసిన 512 స్టేషన్లలో 458 స్టేషన్లు ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యాయని పేర్కొంది. 2018 ఆగస్టు 31 నాటికే అన్ని స్టేషన్లలో ఈ సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. కాగ్ లేవనెత్తిన అన్ని అంశాలను పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నాల్లో భాగంగానే తాజా చర్యలు చేపట్టినట్లు రైల్వే శాఖ పేర్కొంది.

## కల్యాణలక్ష్మి రద్దుకు రేవంత్ కుట్ర

**మొదటి పేజీ తరువాయి**

రూపాయలు చెల్లించి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంలో ఎందుకు కౌంటర్ వెయ్యలేదని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు పేరుతో కల్యాణ లక్ష్మిని పూర్తిగా రద్దు చేసే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాల తరఫున బీఆర్ఎస్ పార్టీ నిలదీస్తోందని తెలిపారు. ఆడబిడ్డల తులం బంగారం అడుగుతున్నందుకే పూర్తిగా కల్యాణ లక్ష్మిని ఎత్తగొట్టే కుట్ర అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రద్దు చేస్తారనే వార్తల నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించాల్సిన ఆందోళనలపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారు

## బట్టలిప్పి కూర్చోబెడతాడట!

**మొదటి పేజీ తరువాయి**

పోస్టులను తొలగించాలని కోరింది, ఏ ఖాతాలపై పరిమితులు విధించాలని అడిగింది వంటి వివరాలను యూజర్లు నేరుగా చూడగలుగుతారు. వీలైతే, ఆ అభ్యర్థనల వెనుక ఉన్న చట్టపరమైన కారణాలు లేదా సమర్థనలను కూడా వెల్లడించనున్నట్లు ఎక్స్ తెలిపింది. ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి ఆన్‌లైన్ కంటెంట్‌ను ఎలా నియంత్రిస్తున్నారు, ర్యాంక్ ఇస్తున్నారు అనే విషయాల్లో యూజర్లకు పూర్తి పారదర్శకత ఉండాలని మస్క్ బలంగా వాదిస్తున్నారు. ఈ తాజా నిర్ణయం అందులో భాగం కానుంది.

# అదిగో ఆకలి రాజ్యం



**మొదటి పేజీ తరువాయి**

కూడా జూన్‌లోనే ఎల్‌నినో పరిస్థితులు అభివృద్ధి చెందుతున్నాయని, రానున్న నెలల్లో ప్రపంచ ఉష్ణోగ్రతలు, వర్షపాత నమూనాల్లో గణనీయమైన మార్పులు, తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించింది.

### మంగోలియాలో ప్రపంచ దేశాల సమావేశం

ఆగస్టు 17 నుంచి 28 వరకు మంగోలియా రాజధాని ఉలాన్‌బాటర్‌లో ఐక్యరాజ్యసమితి ఎడారీకరణ నిరోధక ఒప్పందం 17వ సదస్సు జరగనుంది. 200కు పైగా దేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. భూక్షీణత, ఎడారీకరణ, కరువు, నీటి భద్రత, ఆహార వ్యవస్థలు, పశుపోషణ, భూసంరక్షణకు నిధులు వంటి అంశాలు ప్రధాన చర్చాంశాలుగా ఉండనున్నాయి. మంగోలియాలోనే దాదాపు 77 శాతం భూభాగం భూక్షీణతకు గురైనట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన భూమి ప్రతి సెకనుకు దాదాపు నాలుగు ఫుట్‌బాల్ మైదానాల విస్తీర్ణం చొప్పున కోల్పోతున్నట్లు ఐక్యరాజ్యసమితి అంచనా. సంవత్సరానికి దాదాపు 10 కోట్ల హెక్టార్ల భూమి క్షీణిస్తోంది. భూక్షీణత ఇప్పటికే ప్రపంచ భూభాగంలో 40 శాతం వరకు ప్రభావితం చేసి, 320 కోట్ల మందిపై ప్రభావం చూపుతోందని పేర్కొంది. 2000 సంవత్సరం నుంచి కరువు పరిస్థితులు దాదాపు మూడో వంతు పెరిగాయి. ప్రపంచ ఆహార ఉత్పత్తిలో సుమారు 95 శాతం నేలపై ఆధారపడుతోంది. భూమి నాణ్యత తగ్గితే పంట దిగుబడులు మాత్రమే కాదు.. పంటల్లోని సూక్ష్మ పోషకాలు కూడా తగ్గి 'దాగి ఉన్న ఆకలి' సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

### ఆసియాపై భారీ ప్రభావం

ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాల్లో భారత్, పాకిస్థాన్, మయన్మార్, థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా తదితర దేశాలు ఉన్నాయి. దక్షిణ, ఆగ్నేయ ఆసియాలో వ్యవసాయం ప్రధానంగా రుతుపవనాలపై ఆధారపడటం వల్ల వర్షాభావం నేరుగా పంట దిగుబడులను దెబ్బతీయనుంది. 2015లో ఎల్‌నినో ప్రభావంతో భారత్‌లో మొక్కజొన్న ఉత్పత్తి సుమారు 4 శాతం, వరి ఉత్పత్తి సుమారు 1 శాతం తగ్గినట్లు ఎఫ్ఏవో పేర్కొంది. ఆగ్నేయాసియాలో అదే కాలంలో సుమారు 1.5 కోట్ల టన్నుల వరి నష్టం నమోదైంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌కు ఇది ప్రత్యేకంగా ఆందోళన కలిగించే అంశం. దేశ వార్షిక వర్షపాతంలో సుమారు 70 శాతం రుతుపవనాల నుంచే వస్తుంది. వ్యవసాయ భూమిలో దాదాపు సగం ఇప్పటికీ నీటిపారుదల సదుపాయాలు లేకుండా వర్షాధారంగానే ఉంది. ఆగస్టు 7 నాటికి దేశంలో ఖరీఫ్ పంటల సాగు దాదాపు 9.68 కోట్ల హెక్టార్లకు చేరినా, గత ఏడాదితో పోలిస్తే సుమారు 2 శాతం తక్కువగా ఉంది. ఆగస్టు 11 నాటికి దేశ రుతుపవన వర్షపాతం సాధారణం కంటే 12 శాతం తక్కువగా ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఎల్‌నినో బలపడితే వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, సోయాబీన్, పత్తి వంటి పంటలకు వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతల ముప్పు పెరుగుతుంది. అయితే దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన నష్టం జరుగుతుందని చెప్పలేం. ఎల్‌నినో ప్రభావం ప్రాంతానుసారం మారుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరువు ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో అతివర్షాలు, వరదలు కూడా సంభవించవచ్చు.

### ప్రపంచ ఆహార మార్కెట్లకు షాక్

ఎల్‌నినో ప్రభావం పొలాలకే పరిమితం కాదు. పంట దిగుబడులు తగ్గితే ప్రపంచ మార్కెట్లలో సరఫరా తగ్గుతుంది. ఫలితంగా బియ్యం, గోధుమ, చక్కెర, కాఫీ, కోకో, పామాయిల్ వంటి కీలక వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ గత బలమైన ఎల్‌నినో పరిస్థితులపై చేసిన విశ్లేషణ ప్రకారం.. సాధారణ పరిస్థితి నుంచి బలమైన ఎల్‌నినోకు మారితే ప్రపంచ ఆహార వస్తువుల ధరలు గరిష్ఠంగా 9 శాతం వరకు పెరగవచ్చు. ఈ ప్రభావం సుమారు రెండేళ్ల వరకు కొనసాగవచ్చని అంచనా. ప్రస్తుత ఎల్‌నినో నేపథ్యంలో కాఫీ, కోకో, బియ్యం, గోధుమ, చక్కెర, పామాయిల్ వంటి వస్తువుల సరఫరాపై ఇప్పటికే మార్కెట్లు ఆందోళన చెందుతున్నాయి. పశ్చిమ ఆఫ్రికాలో కోకో, వియత్నాం-బ్రెజిల్‌లో కాఫీ, భారత్-థాయ్‌లాండ్-ఇండోనేషియా-మలేషియాలో చక్కెర, పామాయిల్, ఆసియాలో బియ్యం వంటి ఉత్పత్తులకు వాతావరణ ముప్పు పెరుగుతోంది.

### పంట నష్టం ఎంత?

ప్రస్తుత ఎల్‌నినో వల్ల ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఎన్ని టన్నుల పంట నష్టం జరుగుతుందో ఇప్పటివరకు విశ్వసనీయమైన అధికారిక ప్రపంచ అంచనా విడుదల కాలేదు. ఎల్‌నినో ప్రభావం ఒక ప్రాంతంలో దిగుబడిని తగ్గిస్తే, మరొక ప్రాంతంలో వర్షాలు పెరిగి దిగుబడిని పెంచవచ్చు. అయితే గత అనుభవాలను పరిశీలిస్తే.. 2015-16లో ఆగ్నేయాసియాలో సుమారు 1.5 కోట్ల టన్నుల వరి నష్టం నమోదైంది. హైతీలో కొన్ని ప్రాంతాల్లో పంట దిగుబడులు 70 శాతం వరకు పడిపోయాయి. 2015లో భారత్‌లో మొక్కజొన్న ఉత్పత్తి 4 శాతం, వరి ఉత్పత్తి 1 శాతం తగ్గింది. మధ్య అమెరికా డ్రై కారిడార్‌లో 2015-16 ఎల్‌నినో వల్ల 35 లక్షల మంది ఆహార అసురక్షిత పరిస్థితుల్లోకి వెళ్లారు. 2015-16 ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా 6 కోట్ల మందికి పైగా ప్రజల ఆహార భద్రతను ప్రభావితం చేసింది. కొన్ని 2026 విశ్లేషణలు ప్రస్తుత 'సూపర్ ఎల్‌నినో' పరిస్థితుల్లో ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తి 14.3 శాతం వరకు తగ్గే అత్యంత ప్రతికూల పరిస్థితిని కూడా నమూనాల ద్వారా ప్రస్తావిస్తున్నాయి. అయితే ఇది అధికారిక ప్రపంచ పంట-నష్టం అంచనా కాదు; ఒక తీవ్రమైన పరిస్థితిని ఊహించిన విశ్లేషణాత్మక అంచనా మాత్రమే. అందువల్ల దీనిని ఖచ్చితమైన భవిష్యవాణిగా చూడటం సరికాదు.

### 27.4 కోట్లమందికి ఆకలి మంటలు?

అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంచనా ఆకలి విషయంలో ఉంది. ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రకారం.. బలమైన ఎల్‌నినో కారణంగా వచ్చే ఏడాది చివరి నాటికి ప్రపంచంలోని అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో అదనంగా దాదాపు 4.9 కోట్ల మంది తీవ్రమైన ఆహార అసురక్షిత పరిస్థితుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. 45 అత్యంత ప్రభావితమయ్యే దేశాలను విశ్లేషించగా, ప్రస్తుతం సంక్షోభ స్థాయి లేదా అంతకంటే అధ్వాన్నమైన ఆహార అసురక్షిత పరిస్థితుల్లో ఉన్న జనాభా 4.9 కోట్ల మేర పెరిగి మొత్తం 27.4 కోట్లకు చేరే ప్రమాదం ఉంది.

## గత ఎల్‌నినోల తీవ్రత ఇలా..

**ఎల్‌నినో ప్రభావం కొత్తది కాదు. ముఖ్యంగా 1982-83, 1997-98, 2015-16 కాలాల్లో సంభవించిన బలమైన ఎల్‌నినోలు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో తీవ్ర వాతావరణ, వ్యవసాయ, ఆర్థిక నష్టాలను మిగిల్చాయి.**

- 1982-83 ఎల్‌నినో: 1982-83 ఎల్‌నినో సమయంలో పలు దేశాల్లో తీవ్ర కరువులు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించాయి. వ్యవసాయం, మత్స్య రంగం, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1982-83, 1997-98 ఎల్‌నినోలకు సంబంధించి అమెరికాలోనే వరదల వల్ల 1.4 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగినట్లు గత అధ్యయనాలు పేర్కొన్నాయి.
- 1997-98 ఎల్‌నినో: 1997-98 ఎల్‌నినో ఆధునిక చరిత్రలో అత్యంత బలమైన ఘటనల్లో ఒకటి. పసిఫిక్ దీవుల్లో తీవ్ర కరువులు, పంట నష్టాలు సంభవించాయి. ఆసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో వర్షాభావం, దక్షిణ అమెరికాలో భారీ వర్షాలు, వరదలు, మత్స్య సంపదపై తీవ్ర ప్రభావం కనిపించింది. పలు దేశాల్లో ఆహార భద్రత దెబ్బతింది.
- 2015-16 ఎల్‌నినో: 2015-16 ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా 6 కోట్ల మందికి పైగా ప్రజలను ప్రభావితం చేసింది. 23 దేశాలు మానవతా సహాయం కోసం అంతర్జాతీయ విజ్ఞప్తులు చేయాల్సి వచ్చింది. వ్యవసాయం, ఆహార భద్రత, పోషకాహార పరిస్థితులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మధ్య అమెరికాలోని 'డ్రై కారిడార్'లోనే 35 లక్షల మంది ఆహార అసురక్షిత పరిస్థితుల్లోకి వెళ్లారు. హైతీలో కొన్ని ప్రాంతాల్లో పంట దిగుబడులు 70 శాతం వరకు పడిపోయాయి. ఫలితంగా కొద్ది నెలల్లోనే ఆహార అసురక్షిత పరిస్థితులు రెండింతలయ్యాయి. దక్షిణ ఆఫ్రికాలో 2015-16 తర్వాతి ఎల్‌నినో ప్రభావాలు మరింత తీవ్రమైన కరువు పరిస్థితులకు దారితీశాయి. తాజా ఎఫ్ఏవో విశ్లేషణ ప్రకారం.. ఇటీవలి ఎల్‌నినో చక్రంలో ఆ ప్రాంతం ఒక శతాబ్దానికి పైగా కాలంలో చూడని స్థాయి కరువును ఎదుర్కొంది. 6.1 కోట్ల మంది సహాయం అవసరమైన పరిస్థితికి చేరగా, 80 లక్షల మందికి పైగా ఆహార అసురక్షిత పరిస్థితుల్లోకి వెళ్లారు.

అంటే ప్రస్తుత స్థాయితో పోలిస్తే దాదాపు 22 శాతం పెరుగుదల. మధ్య అమెరికాలో ఆహార అసురక్షిత పరిస్థితులు 83 శాతం వరకు, దక్షిణ ఆఫ్రికాలో దాదాపు 75 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దక్షిణ ఆఫ్రికా, దక్షిణ అమెరికా, కరీబియన్ ప్రాంతాల్లో ఒక్కొక్కటిగా 1.2 కోట్లకు పైగా అదనపు ప్రజలు తీవ్రమైన ఆహార అసురక్షిత పరిస్థితుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.

### ఆర్థిక వ్యవస్థలపై ట్రిలియన్ డాలర్ల భారం

ఎల్‌నినో ప్రభావం పంటలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. 1982-83 ఎల్‌నినో తర్వాత ఐదేళ్ల కాలంలో ప్రపంచ ఆదాయానికి సుమారు 4.1 ట్రిలియన్ డాలర్ల నష్టం జరిగినట్లు ఒక శాస్త్రీయ అధ్యయనం అంచనా వేసింది.

1997-98 ఎల్‌నినో తర్వాత ఐదేళ్లలో ప్రపంచ ఆదాయ నష్టం సుమారు 5.7 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. 2023లో వచ్చిన ఎల్‌నినో ఒక్కటే 2029 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై 3 ట్రిలియన్ డాలర్ల వరకు ప్రభావం చూపవచ్చని అప్పటి అధ్యయనాలు అంచనా వేశాయి. ఈఎన్ఎస్‌ఓ చక్రాల మొత్తం ప్రభావాన్ని పరిశీలించిన మరో అధ్యయనం 1960-2019 మధ్య ప్రపంచ ఆర్థిక ఉత్పత్తిపై సుమారు 13.5 ట్రిలియన్ డాలర్ల సమిష్టి నష్టం జరిగినట్లు అంచనా వేసింది. ఇవి నేరుగా సంభవించే వరదలు, పంట నష్టం వంటి నష్టాల మొత్తం కాదు. వృద్ధి తగ్గడం, ఆదాయ నష్టం, పెట్టుబడుల తగ్గుదల వంటి దీర్ఘకాలిక ఆర్థిక ప్రభావాలను కూడా కలుపుకున్న అంచనాలు.

### మౌలిక సదుపాయాలపైనా ప్రభావం:

ఎల్‌నినో అంటే ప్రతిచోటా కరువు మాత్రమే కాదు. ఒక ప్రాంతంలో కరువు ఉంటే మరొక ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలు రావచ్చు. ఫలితంగా రహదారులు, వంతెనలు, రైల్వేలు, విద్యుత్ వ్యవస్థలు, నౌకాశ్రయాలు, సాగునీటి ప్రాజెక్టులు దెబ్బతినవచ్చు. పనామా కాలువ వంటి అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు కూడా నీటి కొరతతో ప్రభావితమయ్యే అవకాశం ఉంది. నీటిమట్టం తగ్గితే నౌకలపై సరుకు పరిమితులు విధించాల్సి రావచ్చు. దాంతో ప్రపంచ వాణిజ్య రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఇప్పటి ఎల్‌నినోను గత సంఘటనలతో పోల్చితే ఒక ముఖ్యమైన తేడా ఉంది. భూమి ఇప్పటికే వేడెక్కిపోయింది. 2026 ఇప్పటికే ప్రపంచంలోని అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా కొనసాగుతోంది. తీవ్రమైన వేడి గాలులు, కరువులు, అడవుల మంటలు అనేక ప్రాంతాలను బలహీనపరిచాయి. అదే సమయంలో భూక్షీణత, నీటి కొరత, యుద్ధాలు, ఇంధన-ఎరువుల సరఫరా సమస్యలు కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయంలో బలమైన ఎల్‌నినో మరో వాతావరణ ఒత్తిడిగా కాకుండా ఇప్పటికే బలహీనమైన ఆహార వ్యవస్థపై పడే అదనపు భారంగా మారుతుంది. కొంత ఉపశమనం ఏంటంటే.. ప్రపంచంలో ధాన్య నిల్వలు గతంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయి. బ్రెజిల్ సోయాబీన్ ఎగుమతుల్లో, రష్యా గోధుమ ఎగుమతుల్లో తమ సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. భారత్ వద్ద కూడా గణనీయమైన బియ్యం నిల్వలు ఉన్నాయి. చైనాకు గోధుమ నిల్వలు ఉన్నాయి. వ్యవసాయంలో కరువు తట్టుకునే వంగడాలు, నీటిపారుదల, ఖచ్చిత వ్యవసాయం, వాతావరణ హెచ్చరిక వ్యవస్థలు గతంతో పోలిస్తే మెరుగుపడ్డాయి. ఇవి ఎల్‌నినో ప్రభావాన్ని కొంత మేర తగ్గిస్తాయి. కానీ ఆహార నిల్వలు మాత్రమే సరిపోవు. పంటలు విఫలమయ్యే ప్రాంతాల్లో రైతులకు ముందస్తు నగదు సహాయం, విత్తనాలు, పశుగ్రాసం, నీటి నిల్వలు, బీమా, మార్కెట్ మద్దతు అవసరం.

## ఏ దేశానికి ఏ ముప్పు?

- భారత్, దక్షిణాసియా: రుతుపవనాలు బలహీనపడటం, వర్షపాతం అసమానతలు, అధిక ఉష్ణోగ్రతలు, వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, పత్తిపై ఒత్తిడి పెరగవచ్చు. అయితే ప్రాంతాలవారీగా అతివర్షాలు, వరదలు కూడా సంభవించే అవకాశం ఉంది.
- ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్: కరువు, వరి, పామాయిల్, చక్కెర వంటి పంటలపై ప్రభావం ఉండవచ్చు. నీటి కొరత, అడవుల మంటలు కూడా పెరిగే అవకాశం ఉంది.
- దక్షిణ ఆఫ్రికా: కరువు, పశుగ్రాస కొరత, పశుసంపద నష్టం, ఆహార ధరల పెరుగుదల ప్రధాన ప్రమాదాలు. ఇప్పటికే ఈ ప్రాంతం ఎల్‌నినో ప్రభావానికి అధికంగా ప్రభావితం అవుతోంది.
- మధ్య అమెరికా, కరీబియన్: వర్షాభావం, పంట వైఫల్యాలు, ఆహార అసురక్షిత పరిస్థితులు తీవ్రమయ్యే అవకాశం ఉంది. 2015-16 అనుభవం దీనికి స్పష్టమైన ఉదాహరణ.
- బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వే: దక్షిణ ప్రాంతాల్లో అధిక వర్షాలు కొన్ని పంటలకు ప్రయోజనం కలిగించవచ్చు. అదే సమయంలో వరదలు, మట్టి కొట్టుకుపోవడం, రవాణా అంతరాయాలు నష్టాన్ని పెంచవచ్చు. ఉత్తర, పశ్చిమ బ్రెజిల్‌లో కరువు, వేడి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.
- పెరూ, చిలీ: పెరూలో భారీ వర్షాలు, వరదలతో పాటు సముద్ర జలాల వేడెక్కడం వల్ల చేపల వలసలు మారి మత్స్య పరిశ్రమ దెబ్బతినవచ్చు. చిలీలో కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత పెరిగే ప్రమాదం ఉంది.
- అమెజాన్ ప్రాంతం: కరువు, అడవుల మంటలు, నదుల్లో నీటిమట్టం తగ్గడం, జీవవైవిధ్యంపై ఒత్తిడి పెరగవచ్చు. ఇప్పటికే మానవ కార్యకలాపాలు, అటవీ నరికివేత, గత ఎల్‌నినోల ప్రభావాలతో బలహీనపడిన అమెజాన్‌కు కొత్త ఎల్‌నినో మరింత ప్రమాదకరంగా మారవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# టిమ్స్.. పేదోళ్ల గుండె చప్పుడు!

**మొదటి పేజీ తరువాయి**

ఒకే మాస్టర్‌ప్లాన్‌తో రూపొందించిన ఈ ఆస్పత్రిలో 1,082 పడకలు ఉండగా.. అందులో 300 ఐసీయూ పడకలు ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో ఒకే దశలో నిర్మించిన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఇది ఒకటిగా నిలిచింది. టిమ్స్‌ను నాలుగు ప్రధాన బ్లాకులుగా నిర్మించారు. మొత్తం 31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. డయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ ల్యాబ్‌లు, 12 మైక్రోబయాలజీ ల్యాబ్‌లు, 10 బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు, ఐదు ప్రత్యేక ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. బ్లాక్-ఏలో అత్యవసర సేవలు, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ పడకలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీస్ విభాగం ఉన్నాయి. బ్లాక్-బీలో ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, రెండు క్యాథ్ ల్యాబ్‌లు ఉన్నాయి. బ్లాక్-సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లు, సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఏర్పాటు చేశారు. బ్లాక్-డీలో పరిపాలన, విద్యా విభాగాలతో పాటు 200 మంది కూర్చునే ఆడిటోరియం ఉంది.

### 1-2 నిమిషాల్లోనే నమూనాల తరలింపు

టిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దేశంలోనే తొలిసారిగా ఈ తరహా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సీల్డ్ ట్యూబ్‌లు, గాలి ఒత్తిడి ద్వారా రక్త నమూనాలు, మందులు, వైద్య నివేదికలు, అత్యవసర వస్తువులను వార్డులు, ల్యాబ్‌లు, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్‌ల మధ్య కేవలం 1--2 నిమిషాల్లో తరలించవచ్చు. దీంతో పరీక్షల కోసం పట్టే సమయం తగ్గడంతో పాటు నమూనాలు కలుషితం అయ్యే ప్రమాదం కూడా తగ్గనుంది.

అవయవ మార్పిడి, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, ట్రామా కేర్ విభాగాల్లో టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేశారు. కిడ్నీ, కాలేయం, గుండె, బహుళ అవయవ మార్పిడి సేవలకు అవకాశం కల్పించారు. ఆధునిక కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు, లీనాక్ ఆధారిత రేడియోథెరపీ, 24 గంటల అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ సదుపాయాలతో 30 క్లినికల్ విభాగాలు అందుబాటులో ఉండనున్నాయి. ఆస్పత్రిలో 3.0 టెస్లా ఎంఆర్ఐ, 128 స్లైస్ సీటీ స్కానర్, అధునాతన మామోగ్రఫీ యూనిట్, ఐదు ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేశారు. రోగులతో వచ్చే సహాయకుల కోసం జీ ప్లస్ 5 అంతస్తుల్లో నిర్మించిన ధర్మశాలలో 200 మందికి వసతి కల్పించే సదుపాయం ఉంది. 30 మృతదేహాల సామర్థ్యంతో మార్చురీ, కేంద్ర వంటశాల, లాండ్రీ, వైద్య వాయు పైప్‌లైన్ వ్యవస్థలకు ప్రత్యేక బ్లాకులు నిర్మించారు. టిమ్స్ నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆస్పత్రిలో 75 శాతం నీటి పొదుపు సాధించేలా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఎస్టీపీ, ఈటీపీలు ఏర్పాటు చేసి మురుగునీరు, వ్యర్థ ద్రవాలను శుద్ధి చేయనున్నారు. వర్షపు నీటిని సేకరించి మొక్కలు, గ్రీన్ కారిడార్లకు వినియోగించే విధానాన్ని అమలు చేయనున్నారు. పర్యావరణహిత నిర్మాణం, ఇంధన సామర్థ్య వ్యవస్థల కారణంగా ప్రాజెక్టుకు ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ లభించింది. సామాన్య ప్రజలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభించే స్థాయి అత్యాధునిక వైద్య సేవలను ప్రభుత్వ వ్యవస్థలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యానికి టిమ్స్ సనత్‌నగర్ ప్రతీకగా నిలవనుంది. భారీ పడకల సామర్థ్యం, అత్యాధునిక వైద్య పరికరాలు, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, వేగవంతమైన నిర్ధారణ వ్యవస్థలు, పర్యావరణహిత సదుపాయాలతో ప్రభుత్వ వైద్యరంగంలో టిమ్స్ సనత్‌నగర్ కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది.

# ఫేక్ న్యూస్‌కు చెక్

**సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై కేంద్రం క్విక్ రెస్పాన్స్ టీం**

**రెండు గంటల్లో స్పందించేలా వ్యవస్థ.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగంతో సమన్వయం**

న్యూఢిల్లీ: సోషల్ మీడియా వేదికగా వ్యాప్తి చెందుతున్న తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వేగంగా అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వ శాఖలు క్విక్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజల్లో విశ్వాసాన్ని కాపాడటం, ప్రభుత్వ విధానాలు, పథకాలు, నిర్ణయాలపై తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చూడటమే ఈ బృందాల ప్రధాన లక్ష్యమని అధికారిక వర్గాలు వెల్లడించాయి. సోషల్ మీడియాలో ఏదైనా తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే సమాచారం గుర్తించిన వెంటనే సంబంధిత శాఖలు స్పందించేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. సాధ్యమైనంత వరకు గుర్తించిన రెండు గంటల్లోనే ప్రభుత్వ వివరణ ప్రజలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వదంతులు, తప్పుడు వార్తలు, వక్రీకరించిన సమాచారం, సందర్భం మార్చి ప్రచారం చేసే పోస్టులపై సకాలంలో స్పందించడం ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి శాఖకు చెందిన సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మాధ్యమాల బృందాలు తమ శాఖకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తాయి. ముఖ్యంగా ప్రభుత్వ విధానాలు, పథకాలు, కార్యక్రమాలు, నిర్ణయాలు, ప్రకటనలకు సంబంధించిన పోస్టులను పరిశీలిస్తాయి. తప్పుడు లేదా అనుమానాస్పదంగా కనిపించే సమాచారం గుర్తించిన వెంటనే దాన్ని క్విక్ రెస్పాన్స్ టీమ్ దృష్టికి తీసుకెళ్తారు. క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు గుర్తించిన సమాచారాన్ని పరిశీలించి వాస్తవాలను నిర్ధారిస్తాయి. అనంతరం అసలు వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేసేలా సంబంధిత శాఖ తరఫున స్పందన రూపొందిస్తాయి. అవసరమైన సందర్భాల్లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగంతో సమన్వయం చేసుకుంటాయి. అధికంగా వైరల్ అవుతున్న సమాచారం, ప్రజల్లో పెద్దఎత్తున ఆసక్తి లేదా గందరగోళం కలిగించే అంశాలు, సున్నితమైన విధాన నిర్ణయాలకు సంబంధించిన ప్రచారం, ప్రజలకు




హాని కలిగించే అవకాశం ఉన్న సమాచారం వంటి అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. అలాగే చట్టపరమైన సమస్యలకు దారితీసే అంశాలు, సమన్వయంతో సాగుతున్న తప్పుడు ప్రచార కార్యక్రమాలు, ఒకటి కంటే ఎక్కువ శాఖలకు సంబంధించిన అంశాలను కూడా ఉన్నతస్థాయికి పంపిస్తారు. విద్యుత్, వ్యవసాయం, వాణిజ్యం తదితర శాఖలు ఇప్పటికే తమ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగతా శాఖల్లోనూ ఇలాంటి వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయి. సోషల్ మీడియాలో సమాచారం అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో, తప్పుడు వార్తలు నిజమైన సమాచారాన్ని మించి ప్రజలకు చేరే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, విధానాలు, ప్రజా సేవలకు సంబంధించిన తప్పుడు ప్రచారం ప్రజల్లో అనవసరమైన గందరగోళాన్ని సృష్టించవచ్చు. ఈ నేపథ్యంలో తప్పుడు సమాచారాన్ని గుర్తించడం.. వాస్తవాలను నిర్ధారించడం.. ఆలస్యం లేకుండా ప్రజలకు తెలియజేయడం అనే మూడు దశల విధానంతో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు పనిచేయనున్నాయి.

# కల్తీ తిండికి చెక్

**తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు.. ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు**

హైదరాబాద్, ఆగస్టు 16 (ఈవార్తలు): తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. 'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే,



ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## సాహసానికి సెల్యూట్.. సేవకు సత్కారం

**అనుముల నిరంజన్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్**

కరీంనగర్, ఆగస్టు 16 (ఈవార్తలు): దశాబ్దాల పోలీస్ సేవకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుముల నిరంజన్‌రెడ్డికి 2025 సంవత్సరానికి ప్రకటించిన ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ పతకాన్ని అందుకున్నారు. 1989లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన నిరంజన్‌రెడ్డి 1990 జనవరిలో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొలి పోస్టింగ్ పొందారు. తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో విధుల్లో చేరిన ఆయన పలు తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1992లో స్వగ్రామమైన వరంగల్ జిల్లాకు వెళ్తున్న సమయంలో సుమారు 20 మంది మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో నిరంజన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ శంకర్ కూడా గాయపడ్డారు. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా ఎదురు కాల్పుల్లో పాల్గొని ప్రాణాలతో బయటపడ్డారు. అనంతరం కూడా తీవ్రవాద వ్యతిరేక విధుల్లో కొనసాగారు. 1994 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తీవ్రవాద ప్రభావిత వీర్నపల్లిలో సీఆర్పీఎఫ్ పోలీస్ క్యాంపునకు గైడ్‌గా పనిచేశారు. సున్నితమైన పరిస్థితుల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయడంతో పాటు పలు బాంబులు, ఆయుధాల స్వాధీనంలో కీలక పాత్ర పోషించారు.



## ఎల్కతుర్తి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా అడ్డూరి అనిల్

హనుమకొండ, ఆగస్టు 16 (ఈవార్తలు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అడ్డూరి అనిల్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా కొయ్యడ రాజేందర్ మాదిగ ఎన్నికయ్యారు. మాజీ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన కమిటీ నిర్మాణ సదస్సుకు జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కో-ఇన్‌చార్జి తడుగుల విజయ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ పాల్గొన్నారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. అధికార ప్రతినిధిగా జూపాక మధుకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా చదిరం రాకేష్ మాదిగ, ఎల్తూరి వినయ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా ఆరేపల్లి శ్రీనివాస్ మాదిగ, బొంకూరి కార్తీక్ మాదిగ, ఆరేపల్లి రమేశ్ మాదిగ, కోశాధికారిగా సందెల చందు మాదిగ, కార్యదర్శులుగా చిలుముల వినోద్ మాదిగ, మేకల రాజ్‌కుమార్ మాదిగ, కట్కూరి శివకుమార్ మాదిగ, మాటూరి కార్తీక్ మాదిగ, సహాయక కార్యదర్శులుగా గొర్రె చరణ్ మాదిగ, మారుపాక తరుణ్ మాదిగ, సంద్ర పవన్ మాదిగ ఎన్నికయ్యారు.

## భర్త ఇంటి ముందు భార్య ధర్నా

**పురుగుల మందు డబ్బాతో నిరసన.. వేములవాడలో కలకలం**

వేములవాడ అర్బన్, ఆగస్టు 16 (ఈవార్తలు): భర్త ఇంటి ముందు ఓ మహిళ పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగిన ఘటన వేములవాడ పట్టణంలోని సాయి నగర్‌లో కలకలం రేపింది. మేడిపల్లి మండలం కల్వకోటకు చెందిన అరుణ అలియాస్ వైష్ణవి (36), రుద్రంగి మండలానికి చెందిన తోకల రాము (37) ఏడాదిన్నర క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగు నెలల పసిపాప ఉంది. తనను, తన పాపను భర్త ఇంట్లోకి రానివ్వకుండా వేధిస్తున్నాడని అరుణ ఆరోపించింది. మొదటి వివాహం ద్వారా తనకు ఉన్న 15 ఏళ్ల దివ్యాంగ కుమారుడిని వదిలేస్తేనే ఇంట్లోకి రానిస్తానని భర్త షరతు విధించాడని ఆమె వాపోయింది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో భర్త ఇంటి ఎదుట నిరసనకు దిగినట్లు తెలిపింది. ఈ క్రమంలో ఆమె చేతిలో ఉన్న పురుగుల మందును రాము కొంత తాగినట్లు సమాచారం. అనంతరం అతడిని పోలీసులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త వేధింపులపై అరుణ వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.





## భక్తిశ్రద్ధలతో బోనాలు

పద్మారావునగర్, ఆగస్టు 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని న్యూ బోయిగూడలోని కళారంగ్ కాలనీలో శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి భక్తులు బోనాలను సమర్పించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు జీ. పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి విగ్రహంతో ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. వివిధ వేషధారణలు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు గణేష్, వెంకట్, ప్రవీణ్‌కుమార్, జితేందర్, కృష్ణ, రాజు, మురళీ, శంకర్, ప్రభు, రమణ, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే వారం నుంచి నోటిఫికేషన్ల జాతర

హైదరాబాద్, ఆగస్టు 16 (ఈవార్తలు): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు.



## సూర్య ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల, ఆగస్టు 16 (ఈ వార్తలు): శ్రావణ మాసం శుక్లపక్ష చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో ఆదివారం ఉషా చాయ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం అనంతరం స్వామివారికి ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అమృత నిర్గుండి కషాయాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం భక్తులు స్వామివారికి ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, కోశాధికారి గోపి-స్వాతి, భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ, వేముల హరికృష్ణ-రూప, రుచిత, ఆనంది, శుభాష్, ఎలిమేల సత్యనారాయణ, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## చల్‌గల్ కేవీలో లాటరీ తేదీలు మార్పు

జగిత్యాల, ఆగస్టు 16 (ఈవార్తలు): పరిపాలనాపరమైన కారణాలతో కేంద్రీయ విద్యాలయం చల్‌గల్‌లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సిన ఆఫ్‌లైన్ లాటరీ తేదీలను మార్చినట్లు పాఠశాల అధికారులు తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బాలవాటిక-1, 2, 3 తరగతులకు ఆగస్టు 26న ఉదయం 11 గంటల నుంచి, 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఆగస్టు 27న ఉదయం 11 గంటల నుంచి లాటరీ నిర్వహించనున్నారు. దరఖాస్తుదారులు, తల్లిదండ్రులు సవరించిన షెడ్యూల్‌ను గమనించి, తదనుగుణంగా సహకరించాలని అధికారులు కోరారు.



## వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

**బీజేపీ నాయకుడు కాంచి మహేందర్ నివాళి**

కూకట్‌పల్లి, ఆగస్టు 16 (ఈవార్తలు): భారత రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. దేశ సేవకు అంకితమైన వాజ్‌పేయి జీవితం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.



## బండ మైసమ్మ బోనాల్లో బండి రమేశ్

కూకట్‌పల్లి, ఆగస్టు 16: మూసాపేట్ డివిజన్‌లో నిర్వహించిన శ్రీ బండ మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిం చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.


VANGS
GLOBAL TECHNOLOGIES LLP
15 Days Free Trial
Launch Your Own Digital Newspaper Today
Complete ePaper & News Portal Solution
VANGS
Dashboard
12,450
98,765
1,250
2,350
The Daily News
Global Economy Shows Strong Growth in 2024
City Marathon Sets New Record
BREAKING NEWS
CLOUD HOSTING
BREAKING NEWS • BREAKING NEWS •
ePaper Only Pricing
Starter
ePaper Only
10 GB Storage
₹17,999 / Year
★ Most Popular
Professional
ePaper Only
20 GB Storage
₹19,999 / Year
Enterprise
ePaper Only
30 GB Storage
₹21,999 / Year
News Module Add-on: +₹6,000 Extra
Includes full News Portal with all features
Powerful Features
Unlimited News
Unlimited Gallery
Unlimited Web Stories
Unlimited Traffic
SEO Ready
Custom Domain
Push Notifications
Single Click PDF Upload
ePaper Publishing
Breaking News
Live Updates
Custom Menu
Custom Theme
ID Card Designer
Employee News App
Category Management
Heat Track for News Reports & Admin
Multiple Language Support – Yes for All Platforms
ePaper Only Starting from
₹1,799 /month*
Book Free Demo
Start Your 15 Days Free Trial Today
https://vangstechnologies.com
hr@vangstechnologies.com
+91 7675087378



### గేయాన్ని రాజకీయాలకు బలి చేయొద్దు

వందేమాతరం పాడటం తప్పు కాదు. దాన్ని గౌరవించడం కూడా తప్పు కాదు. అదే సమయంలో దాని చరిత్రలో ఉన్న వివాదాస్పద అంశాలపై చర్చించడం కూడా తప్పు కాదు. తప్పు ఏమిటంటే.. ఒక జాతీయ చారిత్రక గేయాన్ని రాజకీయ వైరం కోసం ఉపయోగించడం. భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని కేవలం ఒక మతం, ఒక భాష, ఒక ప్రాంతం లేదా ఒక పార్టీ పోరాటంతో సాధించలేదు. కోట్లాది మంది ప్రజల సమిష్టి పోరాటంతో సాధించింది. ఆ పోరాటంలో వందేమాతరానికి ఉన్న స్థానం చారిత్రకమైనది. అందుకే వందేమాతరాన్ని పాడేవారిని దేశభక్తులుగా, పాడని వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం ఎంత తప్పో.. వందేమాతరాన్ని రాజకీయ కారణాలతో తక్కువ చేసి చూడటం కూడా అంతే తప్పు. భారతమాతకు నమస్కారం చేయడం ఒక రాజకీయ నినాదం కాదు. అది కోట్లాది భారతీయుల భావోద్వేగానికి ప్రతీక. "వందేమాతరం పాడితే తప్పేంటి?" కాదు. "స్వాతంత్ర్య సమరంలో ప్రజలను ఏకం చేసిన వందేమాతరాన్ని మన రాజకీయ విభేదాలకు బలి చేయాల్సిన అవసరం ఏముంది?" అదే అసలు ప్రశ్న.

# భారతమాతకు ఈ బాధేంటి?

('ఈవార్తలు' స్పెషల్ స్టోరీ)

## స్వాతంత్ర్య సమరానికి ఊపిరి.. నేడు రాజకీయ వివాదాలకు ఆజ్యం

**వందే, మాతరం - వందేమాతరం. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను తడిమితే ఈ పదం వెనుక లక్షల మంది భారతీయుల త్యాగం, పోరాటం, జాతీయ చైతన్యం కనిపిస్తాయి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసిన నినాదంగా, స్వదేశీ ఉద్యమానికి స్ఫూర్తిగా, విప్లవకారుల పెదవులపై మార్మోగిన గేయంగా వందేమాతరానికి ప్రత్యేక స్థానం ఉంది. అందుకే స్వతంత్ర భారతదేశం దీనిని జాతీయ గీతంతో సమాన గౌరవం పొందే జాతీయ గేయంగా గుర్తించింది.**

**అలాంటి గేయం మరోసారి రాజకీయ వివాదానికి కేంద్రబిందువైంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించిన సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చేసినట్లు కనిపించిన కొన్ని సంజ్ఞలపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. పూర్తి వందేమాతరం ఆలాపనకు ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారని బీజేపీ ఆరోపించింది.**



### అయితే, అసలు ప్రశ్న ఒక్కటే.. వందేమాతరం పాడటంలో తప్పేముంది?

వందేమాతరం రచయిత బంకిమ్‌చంద్ర చటోపాధ్యాయ. 1875 నవంబర్ 7న ఈ గేయం తొలిసారిగా 'బంగదర్శన్' పత్రికలో ప్రచురితమైందని కేంద్ర ప్రభుత్వ ప్రచురణలు పేర్కొంటున్నాయి. అనంతరం ఇది ఆయన రచించిన 'ఆనందమఠం' నవలలో చోటు చేసుకుంది. వందేమాతరం అంటే "తల్లీ.. నీకు నమస్కారం" అని అర్థం. ఇక్కడ తల్లి అంటే భారత మాతృభూమి. సస్యశ్యామలమైన భూమి, నదులు, పంటలు, చల్లని గాలులు, ప్రకృతి సౌందర్యంతో నిండిన దేశాన్ని తల్లిగా భావించి నమస్కరించే భావన మొదటి రెండు చరణాల్లో ప్రధానంగా కనిపిస్తుంది. 1896లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వందేమాతరాన్ని ఆలపించారు. ఆ తర్వాత ఈ గేయం జాతీయోద్య మంలో మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది.

### స్వదేశీ ఉద్యమానికి నినాదంగా..

1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం శక్తివంతమైన నినాదంగా మారింది. బెంగాల్ నుంచి బొంబాయి, పంజాబ్ వరకు ఈ గేయం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల నిరసనకు ప్రతీకగా మారింది. రాజకీయ సభలు, నిరసన ప్రదర్శనలు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాల్లో వందేమాతరం మార్మోగింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ నినాదాన్ని అణచివేయడానికి ప్రయత్నించడమే దాని ప్రభావాన్ని మరింత పెంచింది. వందేమాతరం పలకడం, పాడటం కూడా వలస పాలకులకు సవాలుగా మారిన సందర్భాలు ఉన్నాయి. విప్లవకారుల ఉద్యమాల్లోనూ ఈ పదం ప్రత్యేక స్ఫూర్తిగా నిలిచింది. అందుకే వందేమాతరం కేవలం ఒక గేయం కాదు. అది ఒక కాలంలో స్వేచ్ఛకు సంకేతం.

### మరి వివాదం ఎందుకు?

వందేమాతరం మొత్తం గేయంలో ఆరు చరణాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం జాతీయ గేయంగా సాధారణంగా ఆలపించేది మొదటి రెండు చరణాలే. దీనికి చారిత్రక కారణాలున్నాయి. గేయంలోని తరువాతి చరణాల్లో దుర్గ, కమల వంటి హిందూ దేవతా ప్రతీకలతో మాతృభూమిని చిత్రించే భావనలు ఉన్నాయి. ఈ అంశం కొంతమంది ముస్లిం నాయకులు, సంస్థలకు అభ్యంతరకరంగా అనిపించింది. ముఖ్యంగా 'ఆనందమఠం' నవలలోని చారిత్రక నేపథ్యాన్ని కూడా దీనికి అనుసంధానించారు. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈ అంశంపై చర్చించి, జాతీయ సమావేశాల్లో వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని సిఫారసు చేసింది. ఆ రెండు చరణాల్లో ఎవరికీ అభ్యంతరం కలిగించే అంశం లేదని, తరువాతి చరణాల్లోని మతపరమైన ప్రతీకలు ఇతర మత సమూహాలకు అసౌకర్యంగా ఉండవచ్చని కమిటీ పేర్కొంది. ఇక్కడే వందేమాతరం చరిత్రలో ఒక కీలక మలుపు వచ్చింది.



### ఠాగూర్ అభిప్రాయం ఏమిటి?

వందేమాతరంపై జరిగిన చర్చల్లో రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయం కూడా ప్రస్తావించదగినది. ఆయన దృష్టిలో మొదటి రెండు చరణాలు మాతృభూమి ప్రకృతి సౌందర్యాన్ని, దేశభక్తిని ప్రతిబింబిస్తాయి. అవి ఏ మతానికీ వ్యతిరేకంగా లేవని ఆయన అభిప్రాయపడ్డారు.



### గాంధీ ఏం అన్నారంటే..

మహాత్మా గాంధీ కూడా వందేమాతరాన్ని స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచిన శక్తివంతమైన గేయంగా చూశారు. 1905లో ఆయన 'ఇండియన్ ఒపీనియన్'లో వందేమాతరం బెంగాల్‌లో ప్రజల మధ్య ఎంతటి ప్రభావాన్ని చూపిందో ప్రస్తావించారు. ఈ గేయం దేశభక్తిని మేల్కొల్పడమే ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించినట్లు ప్రధానమంత్రి మోదీ ఇటీవల ప్రస్తావించారు.

### జాతీయ గీతం కాదు.. జాతీయ గేయం

స్వాతంత్ర్యం అనంతరం "జనగణమన" జాతీయ గీతంగా, "వందేమాతరం" జాతీయ గేయంగా స్థానం సంపాదించాయి. 1950లో రాజ్యాంగ సభ వందేమాతరానికి జాతీయ గేయ హోదా కల్పించింది. జాతీయ గీతంతో సమాన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వ నియమావళిలోనూ పేర్కొన్నారు. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గుర్తించాలి. వందేమాతరం జాతీయ గీతం కాదు. జాతీయ గేయం. కానీ అందువల్ల దాని గౌరవం తక్కువ కాదు. భారత స్వాతంత్ర్య చరిత్రలో దాని పాత్ర ప్రత్యేకమైనది.

### సోనియా గాంధీ వివాదం.. అసలు వాస్తవం ఏమిటి?

ఆగస్టు 15, 2026న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పూర్తి వందేమాతరం ఆలాపన సందర్భంగా సోనియా గాంధీ చేసిన కొన్ని సంజ్ఞలు రాజకీయ వివాదానికి దారితీశాయి. బీజేపీ దీనిని వందేమాతరంపై అభ్యంతరంగా చిత్రించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నాయకులు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ నేతలు క్షమాపణ కోరారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం వందేమాతరం ఆలాపనను అడ్డుకోవాలన్న ఉద్దేశం సోనియా గాంధీకి లేదని స్పష్టం చేసింది. మల్లికార్జున ఖర్గే చాలాసేపు నిలబడటంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాలని ఆమె సూచించిన సందర్భాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని పార్టీ వాదిస్తోంది.

### అయితే అసలు ప్రశ్న వేరే..

వందేమాతరం పాడుతున్నప్పుడు రాజకీయ నాయకులు ఎవరు? ఏ పార్టీకి చెందిన వారు? అనే ప్రశ్న కంటే ముందుగా.. వందేమాతరం ఏ చరిత్ర నుంచి వచ్చింది? అనే ప్రశ్న వేయాలి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయులలో స్వాతంత్ర్య భావనను రగిలించిన గేయాన్ని నేడు రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలకు ఆయుధంగా మార్చడం ఎంతవరకు సమంజసం? వందేమాతరం ఒక పార్టీకి చెందినది కాదు. ఒక కుటుంబానికి చెందినది కాదు. ఒక మతానికి చెందినది కాదు. ఒక ప్రాంతానికి చెందినది కాదు. అది భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో భాగం.

### అభ్యంతరం ఉంటే చర్చించాలి.. అవమానించకూడదు

వందేమాతరంలోని కొన్ని చరణాలపై మతపరమైన అభ్యంతరాలు ఉండొచ్చు. ఆ అభ్యంతరాలను కొట్టిపారేయడం కూడా సరైనది కాదు. భారతదేశం అనేక మతాలు, భాషలు, సంప్రదాయాలతో కూడిన దేశం. ప్రతి వర్గం భావాలను గౌరవించడం ప్రజాస్వామ్య బాధ్యత. అదే సమయంలో వందేమాతరాన్ని పూర్తిగా మతపరమైన గేయంగా ముద్ర వేయడం కూడా దాని స్వాతంత్ర్యోద్యమ చరిత్రను విస్మరించడమే అవుతుంది. మొదటి రెండు చరణాల్లో కనిపించేది భారత భూమి పట్ల ఆరాధనాత్మక భావం. పచ్చని పంటలు, నీరు, గాలి, ప్రకృతి, మాతృభూమి.. ఇవి భారతదేశాన్ని తల్లిగా చూసే కవితా ప్రతీకలు. భారతమాతకు నమస్కరించడం అంటే ఒక మతాన్ని ఆరాధించడం అనే అర్థం తప్పనిసరిగా రాదు. అది మాతృభూమిపై ప్రేమను వ్యక్తం చేసే కవితా భాషగా కూడా చూడవచ్చు. అదే సమయంలో ఎవరైనా మతపరమైన కారణాలతో కొన్ని చరణాలను ఆలపించలేమని చెబితే, వారి విశ్వాస స్వేచ్ఛను కూడా ప్రజాస్వామ్యం గౌరవించాలి.

## దేశభక్తికి రాజకీయ రంగు ఎందుకు?

వందేమాతరం వివాదం ప్రతి కొన్ని సంవత్సరాలకు ఒకసారి రాజకీయ రంగు పులుముకోవడం కొత్త విషయం కాదు. ఒకవైపు దీనిని జాతీయ గౌరవానికి ప్రతీకగా చూపించే రాజకీయ వాదన ఉంది. మరోవైపు మతపరమైన ప్రతీకలున్నాయని చెబుతూ అభ్యంతరం వ్యక్తం చేసే వాదన ఉంది. ఈ రెండు అంచుల మధ్య చరిత్ర ఎక్కడో కనిపించకుండా పోతుంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో వందేమాతరం ప్రజలను బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో ఏకం చేసింది. స్వదేశీ ఉద్యమంలో అది నిరసనకు స్వరమైంది. జాతీయోద్యమ సభల్లో అది మార్మోగింది. బ్రిటిష్ పాలకుల నిషేధ ప్రయత్నాలు కూడా దాని ప్రభావాన్ని తగ్గించలేకపోయాయి. అలాంటి చారిత్రక వారసత్వాన్ని నేటి రాజకీయ పోరాటాల్లో కేవలం ఓట్ల కోణంలో చూడటం దాని విలువను కుదించడం. వందేమాతరం ఎవరిది? ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభం. వందేమాతరం భారతదేశానిది. బంకిమ్‌చంద్రుడి కలం నుంచి పుట్టింది. ఠాగూర్ స్వరంతో జాతీయ వేదికపైకి వచ్చింది. గాంధీ వంటి నాయకుల ఉద్యమ కాలంలో ప్రజల్లో మార్మోగింది. స్వదేశీ ఉద్యమంలో పోరాట నినాదమైంది. అనేక మంది స్వాతంత్ర్య సమరయోధుల పెదవులపై వినిపించింది. చివరకు స్వతంత్ర భారతదేశం దానికి జాతీయ గేయ హోదా ఇచ్చింది. అందువల్ల వందేమాతరాన్ని ఏ రాజకీయ పార్టీ తన సొత్తుగా ప్రకటించుకోవడం ఎంత తప్పో, దాని చారిత్రక ప్రాధాన్యాన్ని ఏ పార్టీ అయినా తక్కువ చేయడం కూడా అంతే తప్పు. దేశభక్తి పరీక్షగా గేయాలు మారకూడదు. ఒక వ్యక్తి వందేమాతరం పాడాడా? ఎంతసేపు పాడాడు? ఎవరు నిలబడ్డారు? ఎవరు కూర్చున్నారు? ఎవరు ఏ సంజ్ఞ చేశారు? ఇవన్నీ రాజకీయ చర్చలుగా మారవచ్చు. కానీ వాటినే దేశభక్తికి కొలమానాలుగా మార్చడం ప్రమాదకరం. దేశభక్తి ఒక పాటలో మాత్రమే ఉండదు. సరిహద్దులో సైనికుడి త్యాగంలో ఉంటుంది. రైతు కష్టంలో ఉంటుంది. కార్మికుడి చెమటలో ఉంటుంది. పన్ను చెల్లించే పౌరుడి బాధ్యతలో ఉంటుంది. చట్టాన్ని గౌరవించే పౌరుడి ప్రవర్తనలో ఉంటుంది. అవినీతిని ప్రశ్నించే ధైర్యంలో ఉంటుంది. వందేమాతరం ఆ భావనకు ఒక చారిత్రక ప్రతీక.





లవ్లీ చిత్రం



నభియా నాజ



## రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేయడం కష్టం: ప్రియా భవానీ శంకర్

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాలో ఆయన సరసన నటి ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రియా భవానీ శంకర్ మీడియాతో మాట్లాడుతూ సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను కావేరి అనే సాధారణ గృహిణి పాత్రలో కనిపిస్తానని ప్రియా చెప్పింది. "తాగుబోతు భర్త, అల్లరి చేసే కూతురితో సాగే మధ్యతరగతి గృహిణి పాత్ర నాది. ఈ పాత్ర వాస్తవానికి చాలా దగ్గరగా ఉంటుంది. ఇలాంటి పాత్ర చేయడం నాకు ఇదే తొలిసారి" అని ఆమె వివరించింది. 'ఇరుముడి' ఒక యాక్షన్ థ్రిల్లర్ అయినప్పటికీ బలమైన భావోద్వేగాలు ఉంటాయని, ముఖ్యంగా తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఎమోషన్ అందరినీ కదిలిస్తుందని వెల్లడించింది. రవితేజతో పనిచేయడంపై మాట్లాడుతూ.. "రవితేజ ఎనర్జీ అసాధారణం. దాన్ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. అయితే ఈ సినిమాలో మీరు మునుపెన్నడూ చూడని ఒక కొత్త రవితేజను చూస్తారు" అని ప్రియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దర్శకుడు శివ నిర్వాణ కథను చెప్పిన విధానం, పాత్రలను మలిచిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆమె ప్రశంసించింది. ప్రస్తుతం తాను 'దూత 2' సిరీస్ షూటింగ్‌లో పాల్గొంటున్నానని, 'డెమోంటే కాలనీ 3' కూడా విడుదలకు సిద్ధంగా ఉందని తన భవిష్యత్ ప్రాజెక్టుల గురించి ప్రియా భవానీ శంకర్ వెల్లడించింది.

## చుడైల్‌తో భయపెట్టనున్న సన్నీలియోన్

బాలీవుడ్ నటి సన్నీ లియోన్ తన తదుపరి ప్రాజెక్టుల విజయం కోసం దైవ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తన భర్త డేనియల్ వెబర్‌తో కలిసి ముంబైలోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించారు. త్వరలో ప్రారంభం కానున్న తన కొత్త సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ ఆమె ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో సన్నీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పింక్ కలర్ ఎంబ్రాయిడరీ సల్వార్ సూట్‌లో ఆమె ఎంతో హుందాగా కనిపించారు. ఆమె భర్త డేనియల్ గ్రీన్ షర్ట్, క్రీమ్ ప్యాంట్‌తో కనిపించారు. ప్రస్తుతం సన్నీ లియోన్ ఒకవైపు సినిమాలు, మరోవైపు అంతర్జాతీయ ప్రదర్శనలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు.



ఇటీవల ఆమె 'డీజే వరల్డ్ టూర్' పేరుతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ టూర్‌లో భాగంగా భారత్‌లోని ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి నగరాలతో పాటు థాయ్‌లాండ్, కెనడా, గ్లాస్గో, డబ్లిన్ వంటి అంతర్జాతీయ నగరాల్లోనూ తన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. త్వరలోనే ఆస్ట్రేలియాలో కూడా ఈ టూర్ జరగనుంది. ఇక సినిమాల విషయానికొస్తే, 'కెన్నడీ' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న సన్నీ, ప్రస్తుతం 'చుడైల్' అనే హారర్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. టీఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాహుల్ దేవ్, మందన కరిమి ప్రధాన పాత్రలు పోషించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ వీధుల్లో తిరిగే ఒక దెయ్యం పాత్రలో సన్నీ కనిపించనుండగా, ఆమెకు పోటీగా మరో అతీతశక్తిగా మందనా కరీమి నటించారు.




## 'మహేంద్రగిరి వారాహి'లో 'బ్రహ్మ'గా బ్రహ్మానందం

దశాబ్దాలుగా తన హాస్యంతో తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్న లెజెండరీ నటుడు బ్రహ్మానందం, ఇప్పుడు ఓ సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. ఆయన తన ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన, సీరియస్ పాత్రతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనున్నారు. సుమంత్ ప్రధాన పాత్రలో, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'లో బ్రహ్మానందం ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర పేరు 'బ్రహ్మ'. దీనికి సంబంధించి చిత్రబృందం ఆదివారం ఓ ప్రత్యేక వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియోలో బ్రహ్మానందం సాంప్రదాయ వస్త్రధారణలో, ఎంతో భావోద్వేగంతో కనిపిస్తారు. "అమ్మా వారాహి, మా మహేంద్రగిరిని కాపాడు తల్లీ" అంటూ వారాహి అమ్మవారిని ప్రార్థిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఈ గ్లింప్స్‌లో ఆయన పాత్రలో హాస్య ఛాయలు ఏమాత్రం కనిపించలేదు. కథలోని దైవిక రహస్యాలతో ముడిపడిన ఓ గంభీరమైన పాత్రలో ఆయన నటిస్తున్నట్లు స్పష్టమవుతోంది.




## 'మల్లెపూల పల్లకి' మాస్ స్టెప్పులు!

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న థ్రిల్లర్ అండ్ డివోషనల్ మూవీ 'ఇరుముడి'. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉండగా, తాజాగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న స్పెషల్ సాంగ్ 'మల్లెపూల పల్లకి' విడుదలైంది. ఆదివారం (ఆగస్టు 16) రాత్రి జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం ఈ పాటను అధికారికంగా విడుదల చేసింది. ప్రముఖ ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ ఆధారంగా రూపొందిన ఈ పాటకు డప్పు శ్రీను గాత్రం అందించగా, చౌడం శ్రీనివాసరావు (వాసు) సాహిత్యం సమకూర్చారు. ఒరిజినల్ ఫ్లేవర్ మిస్ కాకుండా సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ అదే ట్యూన్‌ను కంటిన్యూ చేశారు. శేఖర్ మాస్టర్ కంపోజ్ చేసిన ఈ పాటకు రవితేజ తన ఎనర్జిటిక్ మాస్ స్టెప్పులతో అదరగొట్టారు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి.

## 'ప్రళయ్'గా వస్తున్న రణ్‌వీర్ సింగ్

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన




తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం.

## దుల్కర్, రామ్ అండగా నిలిచారు

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే.





## నిత్యామీనన్ హారర్ ఫాంటసీ

తెలుగు, తమిళం, కన్నడ సినీ పరిశ్రమల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ నిత్యామీనన్. రీసెంట్‌గా 'తలైవాన్ తలైవి', 'ఇడ్లీ కడై' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, చిన్న విరామం తర్వాత ఒక సరికొత్త హారర్ డ్రామాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఒక విభిన్నమైన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. 'యామిరుక్కా బయమే' చిత్రంతో వినోదాత్మక హారర్ జోనర్‌లో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు డీకే ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు టాక్. డీకే మార్క్ కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్‌కు నిత్యామీనన్ వంటి పవర్‌ఫుల్ నటి తోడవ్వడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా, వచ్చే ఏడాది సమ్మర్ రేసులో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

## శ్రీనిధికి లక్కీ చాన్స్

కేజీఎఫ్' సినిమాతో దేశమంతటా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి. 'కేజీఎఫ్ 2' తర్వాత వేరే భాషల్లో బిజీగా మారిన ఆమె, తమిళం, తెలుగు భాషల్లో పలు హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. అతి తక్కువ సమయంలోనే స్టార్స్ సరసన నటించి క్రేజీ హీరోయిన్‌గా మారారు. ప్రస్తుతం తెలుగులో వెంకటేష్ - త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా వేరే భాషల్లో వరస ఆఫర్లు పొందుతున్న సమయంలో, శ్రీనిధి శెట్టికి మళ్లీ కన్నడలో ఓ లక్కీ చాన్స్ దక్కినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. . తాజా సమాచారం ప్రకారం.. దర్శకుడు అనుప్ భండారి తెరకెక్కిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ద్వారా ఆమె మళ్లీ కన్నడ ప్రేక్షకులను పలకరించబోతున్నారట. శ్రీనిధి రీ-ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు అనుప్ భండారి, తన సోదరుడు నిరూప్ భండారితో కలిసి ఈ కొత్త సినిమాను మొదలుపెట్టినట్లు టాక్. ఇందులో హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయగా.. ఇప్పటికే కర్ణాటకలోని కుమ్టా ప్రాంతంలో ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైందట. శ్రీనిధి శెట్టి 'కేజీఎఫ్' తర్వాత ఇక అనుప్ భండారి, నిరూప్ భండారి కలయికలో వస్తున్న నాలుగో సినిమా ఇది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'రంగీతరంగ', 'రాజరథ', 'విక్రాంత్ రోణా' చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.





# చైనాతో డ్రా

ఈవార్తలు-క్రీడావాణి: ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌ను భారత జట్టు డ్రాతో ఆరంభించింది. ఒలింపిక్ కాంస్య పతక విజేత చైనాతో ఆదివారం హోరాహోరీ మ్యాచ్‌లో ఆధిక్యంలో నిలిచిన టీమిండియా ఆఖర్లో పట్టుసడలించింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2-2తో స్కోర్ సమం చేసింది. దాంతో మన జట్టు గెలవాల్సిన మ్యాచ్ కాస్త డ్రాగా ముగిసింది. భారత్ తరఫున నవ్‌నీత్, దీపికలు చెరొక గోల్‌తో రాణించారు. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల జట్టు అదిరే బోణీ కొట్టగా.. మహిళలు మాత్రం డ్రాతో సరిపెట్టుకున్నారు. వాగ్నర్ హాకీ స్టేడియంలో ఆదివారం చైనాను నిలువరించడంలో విఫలమైన టీమిండియా 2-2తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్ మొదలైన 8వ నిమిషంలోనే నేహ అందించిన పాస్‌ను నవ్‌నీత్ మెరుపు వేగంలో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపింది. అయితే.. 15వ నిమిషంలో ఝూంగ్ ఇంగ్ చైనాకు తొలి గోల్ అందించగా స్కోర్ 1-1తో సమం అయింది. రెండో అర్ధ భాగంలో దీపిక డ్రాగ్ ఫ్లిక్ గోల్‌తో ఆధిక్యంలో నిలిచిన భారత్ ఆపై బంతిపై నియంత్రణ కోల్పోయింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2-2తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

## స్పెయిన్.. 21 విజయాల జైత్రయాత్ర

ఈవార్తలు-క్రీడావాణి: స్పెయిన్ ఫుట్‌బాల్ ఆటలోనే కాదు క్రికెట్‌లోనూ దూసుకెళ్తోంది. ఈ మధ్యే ఆ దేశ సాకర్ జట్టు ఫిఫా వరల్డ్‌కప్‌ను ఒడిసిపట్టగా.. తాజాగా స్పెయిన్ పురుషుల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా 'ఆల్‌టైమ్ రికార్డు'ను బ్రేక్ చేసింది. అంతర్జాతీయ టీ20ల్లో అనామక జట్టుగా అడుగుపెట్టి.. వరుసగా 21 విక్టరీలతో ఆసీస్‌ను రెండో స్థానానికి తోసేసిందీ యూరప్ జట్టు. అంతేకాదు 2028లో టీ20 వరల్డ్ కప్ బెర్తుకు గట్టి పోటీదారుగా మారింది స్పెయిన్. ప్రస్తుతం టీ20ల్లో 28వ ర్యాంకులో ఉన్న స్పెయిన్‌కు పొట్టి ఫార్మాట్‌లో ఇది వరసగా 21 విజయం. దాంతో, వరసగా 20 విజయాలతో రికార్డు నెలకొల్పిన ఆస్ట్రేలియా రెండో స్థానానికి పడిపోయింది. 2023 నుంచి 2026 మధ్య 21 విజయాలతో స్పెయిన్ ఈ మైలురాయిని అందుకుంది. ఈ క్రమంలో జెర్సీ, క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, గ్రీస్, ఫిన్లాండ్ వంటి జట్లను ఓడించింది యూరప్ టీమ్.

## గాంధీ జయంతిన
## 2027 వరల్డ్ కప్ ప్రారంభం!

ఈవార్తలు-క్రీడావాణి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్వహించనున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. జాతిపిత మహాత్మా గాంధీకి నివాళిగా, ఈ మెగా టోర్నీని ఆయన జయంతి రోజైన అక్టోబర్ 2న ప్రారంభించాలని ఐసీసీ ప్రాథమికంగా నిర్ణయించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీని గాంధీ జయంతి రోజున ప్రారంభించడం ద్వారా ఆయనకు ప్రత్యేక గౌరవం ఇవ్వాలని భావిస్తున్నారు.



దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ చేసిన పోరాటం చారిత్రాత్మకం. తన జీవితంలో 21 సంవత్సరాలు (1893-1914) అక్కడే గడిపిన గాంధీజీ, సత్యాగ్రహ ఉద్యమానికి బీజం వేసింది కూడా అక్కడే. ఈ నేపథ్యంలో, దక్షిణాఫ్రికాలో గాంధీజీ సాగించిన వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాన్ని, ఆయన అహింసా సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకుని ఆ దేశ జాతిపిత నెల్సన్ మండేలా తదనంతర కాలంలో పోరాటం సాగించిన చారిత్రాత్మక బంధాన్ని స్మరించుకుంటూ.. ప్రపంచకప్‌ను ఆయన జయంతి రోజున ప్రారంభించడం సముచితంగా ఉంటుందని ఆతిథ్య దేశాల క్రికెట్ బోర్డులు భావిస్తున్నాయి. 2027 ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులు చేశారు. గత టోర్నీలో 10 జట్లు పాల్గొనగా, ఈసారి 14 జట్లతో నిర్వహించనున్నారు. ఈ జట్లను ఏడు చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-3లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి. 2003 ప్రపంచకప్ తరహాలో ఈ ఫార్మాట్‌ను మళ్లీ ప్రవేశపెడుతున్నారు. ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు టోర్నీలో నేరుగా ప్రవేశం లభించింది. అయితే, నమీబియా మాత్రం క్వాలిఫయర్స్ ద్వారా అర్హత సాధించాల్సి ఉంటుంది. మొత్తం 54 మ్యాచ్‌లను జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్, దర్బన్‌తో పాటు హరారే, విండ్‌హోక్ వంటి ప్రముఖ వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉంది. ప్రసార హక్కులు, మ్యాచ్‌ల షెడ్యూలింగ్ ఖరారైన తర్వాత ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అక్టోబర్ 2న ప్రారంభమై సుమారు ఏడు వారాల పాటు ఈ టోర్నీ కొనసాగనుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, క్రికెట్ వేదికగా మహాత్ముడికి ప్రపంచం అందించే గొప్ప గౌరవంగా ఇది నిలిచిపోతుంది.

## హండ్రెడ్ ట్రోఫీ.. ట్రెంట్ రాకెట్స్‌దే

**ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్ పరాజయం**

ఈవార్తలు-క్రీడావాణి: మహిళల హండ్రెడ్ లీగ్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో జయభేరి మోగించిన ట్రెంట్ రాకెట్స్ తమ కలను సాకారం చేసుకుంది. లీగ్ దశలో దుమ్మురేపిన సన్‌రైజర్స్ లీడ్స్‌ను టైటిల్ పోరులో 91 పరుగులకే కట్టడి చేసిన రాకెట్స్.. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని రాకెట్స్ ది హండ్రెడ్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. ఇంగ్లండ్ గడ్డపై నిర్వహించిన మహిళల హండ్రెడ్ లీగ్ 2026 టైటిల్‌ను ట్రెంట్ రాకెట్స్ ఒడిసిపట్టింది. లార్డ్స్ మైదానంలో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్‌పై భారీ విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది రాకెట్స్.





# గాలే టెస్టు.. భారత్ పట్టు

### పడిక్కల్ భారీ ఇన్నింగ్స్.. కేఎల్, జురెల్ హాఫ్ సెంచరీలు

### 460/9 పరుగుల వద్ద టీమిండియా

ఈవార్తలు-క్రీడావాణి: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై టీమిండియా పూర్తి పట్టు సాధించింది. యువ ఓపెనర్ దేవదత్ పడిక్కల్ (167) బాదిన అద్భుత శతకానికి, కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) సాధించిన కీలక అర్ధ శతకాలు తోడవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 460 పరుగుల భారీ స్కోరు చేసింది.

**వర్షం కారణంగా రెండో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, భారత బ్యాటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. వర్షం వల్ల తొలి సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో, రెండో రోజు కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా పడిక్కల్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ భారీ శతకాన్ని నమోదు చేశాడు.**



రాహుల్, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను శ్రీలంక స్పిన్నర్లు కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత 3 వికెట్లు పడగొట్టగా, సీనియర్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య 4 వికెట్లతో రాణించాడు. రెండో కొత్త బంతితో లంక బౌలర్లు పుంజుకొని వరుసగా వికెట్లు తీశారు. రవీంద్ర జడేజా (13)ను నువంత ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ దూకుడుగా ఆడాడు. కేవలం 68 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 51 పరుగులు చేసి జట్టు స్కోరును 400 దాటించాడు. అయితే, అర్ధ శతకం పూర్తయిన వెంటనే జయసూర్య బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న కెప్టెన్ ధనంజయ డిసిల్వా అద్భుతమైన డైవింగ్ క్యాచ్ పట్టడంతో జురెల్ వెనుదిరిగాడు. చివర్లో మహమ్మద్ సిరాజ్, మానవ్ సుతార్ (24) వేగంగా పరుగులు జోడించారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. క్రీజులో కుల్‌దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) ఉన్నారు. కాగా, టీమిండియా తన ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసి, మూడో రోజు ఉదయాన్నే శ్రీలంకను బ్యాటింగ్ కు ఆహ్వానించి, వారి లైనప్ ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంది.

### జైస్వాల్ అరుదైన ఘనత

భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బరిలోకి దిగడం ద్వారా అతను భారత దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సంజయ్ మంజ్రేకర్ క్లబ్‌లోకి చేరాడు. జైస్వాల్ తన కెరీర్‌లో ఆడిన 30 టెస్టులను 30 వేర్వేరు వేదికలపై ఆడటం విశేషం. గతంలో సంజయ్ మంజ్రేకర్ వరుసగా 33 టెస్టులు, సచిన్ టెండూల్కర్ 32 టెస్టులు వేర్వేరు మైదానాల్లో ఆడి ఈ జాబితాలో ముందున్నారు.

టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆతిథ్య జట్టుకు చుక్కలు చూపిస్తూ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. డార్విన్ వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి టెస్టులో కంగారూలను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసి చరిత్రలో నిలిచిపోయే గెలుపును సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియాలో బంగ్లాదేశ్‌కు ఇదే మొట్టమొదటి టెస్టు విజయం కావడం గమనార్హం.





# బంగ్లా బెబ్బులి!

### ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయం.. టెస్టు క్రికెట్‌లో సంచలనం.. 2 టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో బంగ్లా

ఈవార్తలు-క్రీడావాణి:

బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ఆసీస్‌ను అన్ని విధాలా దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా, బంగ్లా బౌలర్ల ధాటికి తలవంచింది. స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే కాస్త ప్రతిఘటించినా, మిగతా బ్యాటర్లు విఫలమవడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 6 వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడిన బంగ్లాదేశ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. యువ ఓపెనర్ తంజిద్ హసన్ (101) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, నజ్ముల్ హొస్సేన్ శాంటో (84), మెహిదీ హసన్ మిరాజ్ (65) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. దీంతో బంగ్లా తమ తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించి, 228 పరుగుల కీలక ఆధిక్యాన్ని అందుకుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా మరోసారి తడబడింది. కామెరాన్ గ్రీన్ (104) ఒంటరి పోరాటంతో సెంచరీ సాధించినా, జట్టును ఆదుకోలేకపోయాడు. బంగ్లా స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్ 5 వికెట్లతో చెలరేగడంతో ఆస్ట్రేలియా 284 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో బంగ్లాదేశ్ ముందు 57 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఈ సులువైన లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. షాద్‌మాన్ ఇస్లాం (25 నాటౌట్), మోమినుల్ హక్ (30 నాటౌట్) నిలకడగా ఆడి జట్టుకు చారిత్రక విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టుపై వారి సొంత గడ్డపై సాధించిన ఈ విజయం బంగ్లా క్రికెట్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుంది.

**ప్రక్షాళన చేయాల్సిందే: పాంటింగ్**

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో ప్రక్షాళన చేయాల్సిందేనని మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. స్వదేశంలో బంగ్లాదేశ్ చేతిలో డార్విన్ వేదికగా జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో పాంటింగ్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. జట్టు బ్యాటింగ్ లైనప్‌లో వెంటనే మార్పులు చేసి, యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశాడు. ఈ ఓటమి అత్యంత అవమానకరమని, జట్టులో మార్పులు చేయడం అనివార్యమని తాను భావిస్తున్నట్లు తెలిపాడు. "సాధారణంగా జట్టులో మార్పులు చేయాలని కోరుకునే వారిలో నేను చివరివాడిని.



ఒక కెప్టెన్‌గా లేదా ఆటగాడిగా జట్టును కలిపి ఉంచడానికే ప్రాధాన్యత ఇస్తాను. కానీ, పరిస్థితులు చేయి దాటినప్పుడు మార్పుల గురించి మాట్లాడక తప్పదు. జట్టు ప్రదర్శన చూశాక, మార్పులు చేయడం సరైనదనిపిస్తోంది. కొత్త ఓపెనర్‌ను, నంబర్ 3 స్థానంలో మరో ఆటగాడిని తీసుకురావడం ద్వారా జట్టు పెద్దగా నష్టపోయేదేమీ లేదు. ఈ ప్రక్షాళన కచ్చితంగా జరగాలి" అని వివరించాడు.

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# పోయింది వాన.. ఇంకెప్పుడస్తదో?

వానాకాలం వచ్చిందన్న ఆనందం కంటే వాన ఎప్పుడు పడుతుందో, పడిన తర్వాత మళ్లీ ఎప్పుడు వస్తుందోనన్న ఆందోళనే రైతన్నను వెంటాడుతోంది. ఆకాశం మేఘాలతో నిండుతున్నా.. నేల మాత్రం తేమ కోసం ఎదురుచూస్తోంది. వానాకాలం అంటే ఒకప్పుడు రైతుకు ఆశ. తొలకరి చినుకులు పడగానే పొలంలో సందడి మొదలయ్యేది. దుక్కులు దున్నేవారు. విత్తనాలు సిద్ధం చేసుకునేవారు. చెరువులు, కుంటలు నిండుతాయని ఆశపడేవారు. పంట చేతికొస్తుందన్న నమ్మకంతో అప్పులు చేసి అయినా సాగుకు సిద్ధమయ్యేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి క్రమంగా మారుతోంది. ఆకాశంలో మబ్బులు కనిపిస్తాయి.. చినుకులు పడతాయి.. కొద్దిసేపటికే వాన ఆగిపోతుంది. ఆ తర్వాత రోజుల తరబడి ఆకాశం వైపు చూడాల్సిందే. రైతు నోట ఒక్కటే మాట.. 'పోయింది వాన.. ఇంకెప్పుడస్తదో?' ఇది కేవలం వర్షాభావం గురించి మాట్లాడే ప్రశ్న కాదు. మారుతున్న వర్షపాత తీరుపై రైతు వ్యక్తం చేస్తున్న ఆందోళన. వాన పడటం కంటే.. వాన ఎప్పుడు పడుతుంది? ఎంత పడుతుంది? పడిన తర్వాత ఎన్ని రోజులు నేలలో తేమ ఉంటుంది? అన్నదే వ్యవసాయానికి కీలకంగా మారింది. విత్తనం వేసిన వెంటనే తగినంత వర్షం పడకపోతే మొలక దెబ్బతింటుంది. మొలక వచ్చిన తర్వాత వాన ఆగిపోతే పంట ఎదుగుదల మందగిస్తుంది. ఎరువులు వేసిన తర్వాత తగినంత తేమ లేకపోతే వాటి ప్రయోజనం తగ్గుతుంది. మరోవైపు ఒక్కసారిగా భారీ వర్షం పడితే పొలాల్లో నీరు నిలిచి పంట నష్టపోవచ్చు. అంటే రైతుకు ఇప్పుడు వాన లేకపోవడం ఎంత సమస్యో.. వాన తీరు అస్తవ్యస్తంగా ఉండటం కూడా అంతే పెద్ద సమస్య. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం స్వభావంలో మార్పులు వస్తున్న నేపథ్యంలో పాత వ్యవసాయ క్యాలెండర్‌తోనే ముందుకు వెళ్లడం ఇక సాధ్యం కాదు. రైతుకు కేవలం 'వర్షం పడే అవకాశం ఉంది' అనే సమాచారం సరిపోదు. మరో ఐదు రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుంది? వర్షం ఎప్పుడు కురిసే అవకాశం ఉంది? ఎన్ని మిల్లీమీటర్ల వర్షం పడవచ్చు? విత్తనం వేయడానికి అనుకూల సమయం ఏది? వంటి స్థానిక, పంట ఆధారిత సమాచారం అందాలి. వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖలు గ్రామస్థాయిలో రైతుకు చేరువ కావాలి. మొబైల్ సందేశాలు, గ్రామస్థాయి ప్రకటనలు, రైతు వేదికలు, స్థానిక సలహా కేంద్రాల ద్వారా వాతావరణ సమాచారం అందించాలి. రైతు వానను ఊహించి నిర్ణయం తీసుకునే పరిస్థితి నుంచి.. సమాచారం ఆధారంగా నిర్ణయం తీసుకునే పరిస్థితికి రావాలి.



# కాక్రోచ్ పార్టీ.. మళ్లీ సక్సెస్ అవుతుందా?



**వ్యంగ్యంగా మొదలైన ఓ ఆన్‌లైన్ ఉద్యమం.. దేశవ్యాప్తంగా యువత ఆగ్రహానికి వేదికగా మారింది. పరీక్షల అక్రమాలు, ఉద్యోగాల కొరత, విద్యా వ్యవస్థలో లోపాలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలను ముందుకు తెచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' తొలి దశలోనే గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇప్పుడు 'సీజన్-2'కు సంకేతాలు ఇస్తున్న నేపథ్యంలో.. మరోసారి అదే స్థాయిలో ప్రజా మద్దతు సాధించగలదా అన్నదే ప్రశ్న.**

ఒకప్పుడు ఒక సరదా వ్యాఖ్య. ఆ వ్యాఖ్యపై సోషల్ మీడియాలో మొదలైన వ్యంగ్యం. ఆ వ్యంగ్యం నుంచి ఒక గుర్తింపు. ఆ గుర్తింపు నుంచి యువత సమీకరణ. చివరకు దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసిన ఉద్యమం. ఇదే 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రయాణం. మొదట్లో చాలామంది దీనిని ఒక సోషల్ మీడియా సరదాగా చూశారు. కానీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, విద్యార్థుల భవిష్యత్తుపై అనిశ్చితి వంటి సమస్యలు దానికి ప్రజా సమస్యల రూపాన్ని ఇచ్చాయి. ఈ ఉద్యమం తొలి దశలోనే ఒక ముఖ్యమైన రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. యువతను తక్కువగా అంచనా వేయకూడదు. వారి చేతిలో సోషల్ మీడియా ఉంది. సమాచారాన్ని క్షణాల్లో పంచుకునే సామర్థ్యం ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న యువతను ఒకే అంశంపై సమీకరించే శక్తి ఉంది. ముఖ్యంగా తమ భవిష్యత్తుతో ముడిపడిన సమస్య ఎదురైతే.. సంప్రదాయ రాజకీయ వ్యవస్థల బయట కూడా ఉద్యమాన్ని నిర్మించగలరని కాక్రోచ్ ఉద్యమం చూపించింది. పరీక్షల సంస్కరణలు, జవాబుదారీతనం వంటి డిమాండ్లపై సాగిన నిరసనలకు దేశవ్యాప్తంగా దృష్టి లభించింది. చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ప్రభుత్వం కొన్ని డిమాండ్లపై చర్చలకు రావడం ఉద్యమానికి తొలి విజయాలుగా దాని నాయకత్వం పేర్కొంది. అయితే ఇక్కడి నుంచే అసలు పరీక్ష మొదలవుతుంది. ఒక ఉద్యమం ప్రభుత్వాన్ని ఒకసారి వెనక్కి తగ్గించగలగడం వేరు.. నిరంతర ప్రజా ఉద్యమంగా నిలబడటం వేరు. కాక్రోచ్ పార్టీ ఇప్పుడు మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు సంకేతాలు ఇస్తోంది. 'జంతర్ మంతర్ సీజన్-2' పేరుతో కొత్త దశ నిరసనలను ప్రారంభించే ఆలోచనను పార్టీ నాయకత్వం వెల్లడించింది. అయితే రెండో ఉద్యమానికి తొలి ఉద్యమం కంటే ఎక్కువ బాధ్యత ఉంటుంది. మొదటిసారి యువతను కదిలించిన అంశాలు ప్రధానంగా పరీక్షల అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, ఉద్యోగాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. ఇప్పుడు అదే ఆవేశాన్ని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే స్పష్టమైన లక్ష్యం,





**- వెంకటేశ్ గుగ్గిళ్ల,**
**ఈవార్తలు**
**దినపత్రిక రిపోర్టర్**

నిర్దిష్ట కార్యాచరణ, సాధించగల డిమాండ్లు అవసరం. కేవలం ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉద్యమం ఎక్కువకాలం నిలబడదు. యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి? పరీక్షల వ్యవస్థలో పారదర్శకత ఎలా పెరుగుతుంది? ప్రశ్నపత్రాల లీకేజీలను ఎలా అరికట్టాలి? నియామక ప్రక్రియను ఎలా మార్చాలి? కోచింగ్ సంస్కృతి వల్ల మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారం ఎలా తగ్గించాలి? విద్యా వ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎలా మార్చాలి? వంటి ప్రశ్నలకు ఉద్యమం సమాధానాలు చూపాలి.

మరోవైపు రాజకీయ పార్టీగా ఎదగాలన్న ఆలోచన ఉంటే మరింత జాగ్రత్త అవసరం. ఉద్యమం ప్రజల అసంతృప్తిని వ్యక్తం చేయగలదు. కానీ రాజకీయ పార్టీ ప్రజలకు ప్రత్యామ్నాయ పాలనా నమూనాను చూపించాలి. ప్రభుత్వాన్ని విమర్శించడం ఒక బాధ్యత అయితే.. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పడం అంతకంటే పెద్ద బాధ్యత. కాక్రోచ్ పార్టీకి మరో ప్రమాదం వ్యక్తికేంద్రిత ఉద్యమంగా మారడం. ఒకరిద్దరు నాయకుల చుట్టూ ఉద్యమం తిరిగితే వారి ప్రజాదరణ తగ్గినప్పుడు ఉద్యమం కూడా బలహీనపడే అవకాశం ఉంది. అందుకే సంస్థాగత నిర్మాణం అవసరం. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్థానిక సమస్యలను అర్థం చేసుకునే నాయకత్వం అవసరం. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగార్థులు, గ్రామీణ యువత, చిన్న పట్టణాల యువతకు సమాన ప్రాతినిధ్యం అవసరం. ఇప్పటికే కాక్రోచ్ ఉద్యమం తొలి దశలో యువతకు ఒక వేదికగా నిలిచింది. దాని నాయకత్వ బృందంలో ఐఐటీ పట్టభద్రులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, జర్నలిస్టులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు వంటి విభిన్న వృత్తుల వారు ఉన్నట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఇది ఒక రాజకీయ ప్రయోగానికి బలంగా మారవచ్చు. కానీ ఒక ఉద్యమం విజయవంతం కావడానికి సోషల్ మీడియా అనుచరులు సరిపోరు. రోడ్డుపై నిలబడే కార్యకర్తలు కావాలి. ఓటు వేయించే సంస్థాగత శక్తి కావాలి. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రజలతో నిరంతర సంబంధం కావాలి.

ఇక్కడే మరో ప్రశ్న. కాక్రోచ్ పార్టీ యువత కోపాన్ని మాత్రమే ప్రతిబింబిస్తుందా? లేక యువతకు భవిష్యత్తు చూపించే రాజకీయ ప్రత్యామ్నాయంగా మారుతుందా? ఇది తేల్చేది రాబోయే రోజులు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ప్రశ్నించే ఉద్యమాలు అవసరం. ముఖ్యంగా యువత ప్రశ్నించడం మరింత అవసరం. పరీక్ష రాసిన విద్యార్థి తన ఫలితం కోసం నెలలు, సంవత్సరాలు ఎదురుచూస్తున్నప్పుడు.. ప్రశ్నపత్రం లీక్ అయితే అతని భవిష్యత్తును ఎవరు తిరిగి ఇస్తారు? ఉద్యోగం కోసం వయసు దాటిపోతున్న యువకుడికి మరో అవకాశం ఎవరు ఇస్తారు? లక్షల రూపాయలు ఖర్చు చేసి చదువుకున్న విద్యార్థికి ఉద్యోగం రాకపోతే అతని బాధ్యత ఎవరిది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పే వరకు ఏ ప్రభుత్వానికైనా యువతను విస్మరించే హక్కు లేదు. అయితే ఉద్యమం కూడా తన పరిమితులను గుర్తించాలి. హింసకు, ద్వేషానికి, వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలి. రాజ్యాంగబద్ధమైన మార్గాల్లోనే పోరాడాలి. సమస్యను వ్యక్తిపై కాకుండా విధానంపై కేంద్రీకరించాలి. అప్పుడు మాత్రమే ఉద్యమానికి నైతిక బలం ఉంటుంది. కాక్రోచ్ పార్టీ తొలి పోరాటం ఒక తలుపు తెరిచింది. రెండో పోరాటం ఆ తలుపు దాటి ప్రజా రాజకీయాల్లోకి వెళ్లగలదా లేదా అన్నది నిర్ణయించనుంది.



# తుపాకీకి అనుమతి.. భయానికి లైసెన్స్?

తుపాకీ చేతిలో ఉండటం రక్షణకు అవసరం కావచ్చు. కానీ అదే తుపాకీ ఎదుటివారి గుండెల్లో భయం పుట్టించే సాధనంగా మారితే? లైసెన్సు ఉన్న ఆయుధం చట్టబద్ధమైనదే కావచ్చు.. దాన్ని ఉపయోగించే తీరు మాత్రం చట్టబద్ధంగా ఉండాలి. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. నక్సలిజం ముప్పు తగ్గడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు తన భద్రతను తగ్గిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా ప్రకటించారు. భద్రతా ముప్పు తగ్గిందని భావించి ముఖ్యమంత్రి, డీజీపీ స్థాయి వ్యక్తులకే రక్షణను పునఃపరిశీలిస్తున్నప్పుడు.. సాధారణ వ్యక్తుల వద్ద కొనసాగుతున్న ఆయుధ లైసెన్సుల అవసరాన్ని కూడా ఒకసారి పరిశీలించాల్సిన సమయం రాలేదా? నిన్నటి ముప్పు ఈరోజు లేకపోతే.. నిన్నటి అనుమతిని ఈరోజు కూడా ఎందుకు కొనసాగించాలి? లైసెన్సు మంజూరు చేసిన నాటి పరిస్థితులు మారితే.. ఆ అవసరం ఇంకా ఉందా లేదా అన్నది చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కాదా? సంఖ్యల వెనుక దాగిన అసలు ప్రశ్న.. 2025 మేలో అప్పటి డీజీపీ జితేందర్ వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 7,125 చెల్లుబాటు అయ్యే ఆయుధ లైసెన్సులు, 9,294 నమోదిత ఆయుధాలు ఉన్నాయి. గత మూడేళ్లలో 510 కొత్త లైసెన్సులు మంజూరయ్యాయి. ఇవి కేవలం గణాంకాలు కావు. ప్రతి లైసెన్సు వెనుక ఒక వ్యక్తి.. ఒక ఆయుధం.. ఒక బాధ్యత ఉంది. అందుకే ప్రశ్న కొత్త లైసెన్సులు ఎన్ని ఇచ్చారన్నదే కాదు. ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇచ్చారు? ఆ అవసరం ఇప్పటికీ ఉందా? ఆయుధం ఎలా ఉపయోగిస్తున్నారు? అన్నదే. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, భూవివాదాలు, వ్యక్తిగత తగాదాలు, సెటిల్‌మెంట్లలో ఆయుధ ప్రదర్శన జరుగుతోందనే ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తుంటాయి. ప్రతి ఆరోపణ నిజమని చెప్పడం కాదు. కానీ ఫిర్యాదు వచ్చినప్పుడు లైసెన్సు ఉందన్న ఒక్క కారణంతో దాన్ని తేలిగ్గా తీసుకోవడం కూడా సమంజసం కాదు. తుపాకీని చూపించడం ద్వారా ఎదుటివారిపై మానసిక ఒత్తిడి తెస్తే.. అది రక్షణ భావనను దాటి పెత్తనానికి దారితీసినట్టే. తుపాకీ చట్టం ఇచ్చిన అనుమతి కావచ్చు.. కానీ సమాజంపై ఆధిపత్యానికి అది పాస్‌పోర్టు కాదు. సైబర్ నేరగాడు తెర వెనుక నుంచి ప్రజల డబ్బును దోచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆయుధాన్ని దుర్వినియోగం చేసే వ్యక్తి మాత్రం సమాజం కళ్లముందే భయాన్ని సృష్టించే అవకాశం ఉంది. మార్గాలు వేరు.. కానీ ప్రజల భద్రతకు ముప్పు కలిగితే రెండింటినీ చట్టం సమానంగా చూడాలి. అందుకే పోలీసు నిఘా కేవలం అక్రమ ఆయుధాలపైనే కాకుండా చట్టబద్ధంగా ఉన్న ఆయుధాల దుర్వినియోగంపైనా ఉండాలి.

పోలీసు వ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తున్న డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆయుధ లైసెన్సుల సమీక్ష మరో ముఖ్యమైన పరీక్ష కావచ్చు. రాజకీయ పలుకుబడి, ఆర్థిక స్థాయి, సామాజిక ప్రభావం వంటి వాటికి అతీతంగా ప్రతి లైసెన్సును ఒకే ప్రమాణంతో పరిశీలించగలిగితే.. అది ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంచుతుంది. నిజమైన ముప్పు ఉన్నవారికి ఆయుధం అవసరం కావచ్చు. కానీ అవసరం ముగిసినప్పుడు సమీక్ష కూడా అవసరమే. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం లైసెన్సుపై చర్య తీసుకోవడం కూడా అదే వ్యవస్థ బాధ్యత. సమాజంలో ఒక ప్రమాదకరమైన భావన పెరగకూడదు.. "నా దగ్గర గన్ ఉంది.. నన్నెవరూ ఏమీ చేయలేరు" అనే ధోరణి. చట్టం ఇచ్చిన లైసెన్సు చట్టం నుంచి మినహాయింపు కాదు. ప్రజాస్వామ్యంలో అసలైన బలం తుపాకీ గొట్టంలో ఉండదు. చట్టంపై నమ్మకంలో ఉంటుంది. భయంతో వచ్చిన గౌరవం గౌరవం కాదు. అది మౌనంగా భరించిన భయం. అందుకే రాష్ట్రంలో ఆయుధ లైసెన్సులపై ఒకసారి సమగ్ర సమీక్ష జరగాలి. ముప్పు ఉన్నవారిని రక్షించాలి. అవసరం లేనివారిని గుర్తించాలి. దుర్వినియోగం నిర్ధారణైన చోట చట్టం తన పని తాను చేయాలి. ఎవరి పలుకుబడి ఎంత ఉన్నా ప్రమాణం ఒక్కటే కావాలి. తుపాకీ రక్షణకు ఉండాలి.. పెత్తనానికి కాదు. లైసెన్సు హక్కు కాదు.. బాధ్యత. భద్రత పేరుతో వచ్చిన ఆయుధం.. సమాజానికి భయంగా మారకూడదు. అప్పుడే పోలీసు సంస్కరణలకు అర్థం ఉంటుంది. అప్పుడే ప్రజలు పోలీసు వ్యవస్థను కేవలం భద్రత కల్పించే సంస్థగా కాకుండా.. చట్టం అందరికీ సమానంగా వర్తించే వ్యవస్థగా విశ్వసిస్తారు.



**- శ్రీశైలం దూడం,**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,**
**9133947176**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMARfrom H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004